# ఓడిపోయాను!

శీతాకాలం సాయంత్రం అందంగా, ఆహ్లాదంగా వుంది. నీలా
ాశంలో తెల్లటి మబ్బులు దూది పింజల్లా తేలిపోతున్నాయి. ఎండలో
ారుకుదనం లేదు. మిలమిలా మెరుస్తున్న నీరెండలో చెట్లు, మనుష్యులు,
స్సులు ఒకటేమిటి: ప్రపంచం యావత్తూ అదో రకమైన వెలుగుతో
శతళ లాడింది. అలా తళతళ లాడుతున్నట్టు బంగారపు ఎండలో సికిం
ాబాద్ స్టేషన్ ఆకాశంలోకి లేచి నిలబడ్డట్టుగా వున్నతంగా, హుందాగా
ుంది. ఎత్తుగా, విశాలంగా నిలబడివున్న ఆ భవనంలో పై అంతస్తు కిటికీ
గ్గర ఒకతను నిలబడి వున్నాడు. అతని వయసులో కన్పిస్తున్న యవ్వ
ంతోపాటు శరీరంలో పరిపూర్ణమయిన ఆరోగ్యంకూడా నిండుగా తాణి
సలాడింది. దాదాపు ఆరడుగుల పొడుగుతో, చామన చాయ రంగులో
మున్నతంగా వున్న శరీరాకృతితో అతను నిలబడే తీరులోనే ఒక ప్రత్యే
త వుంది. ప్రక్క పాపిడి తీసుకుని నీట్‌గా పైకి దువ్వుకున్న జుట్టు,
దువ్వుకోవడంలోనే కన్పిస్తున్న కొత్త పద్ధతి చూపరుల దృష్టిని తన
పు లాక్కుంటోంది. అతను వేసుకున్న తెల్లటి మల్లెపువ్వులాటి బట్టలు
ుహంలో కన్పిస్తున్న నిష్కల్మషమయిన హృదయానికి ప్రతిబింబంలా
న్నాయి. మొహం ఆకృతినీ, ముఖ్యంగా కొద్దిగా మోటుగా వున్న ఆ
దవులని చూస్తూంటే మనిషి తనకు కలిగిన అభిప్రాయాన్ని ఓ పట్టాన
ార్చుకోడన్నట్లుంది. ఒకసారి దేనిపైనైనా దృష్టిని సారిసే చాలు-దాని
ంగతి ఆసాంతం ఆకళింపుచేసుకోగలవు అనేట్టున్న కళ్ళు క్రింద స్టేషన్‌లో
చ్చేపోయే బస్సులూ, హడావుడిగా తిరుగుతున్న మనుష్యులమధ్య ఎవరి
సమో ఆత్రంగా వెతుక్కుంటున్నాయి. బస్సులు వస్తున్నాయి. జనం
క్కుతున్నారు, దిగుతున్నారు. అతను ఆశించిన వ్యక్తిమటుకు వచ్చిన
డ కన్పించలేదు. అప్పటికి ఐదోసారి టైమ్ చూసుకున్న అతను కళ్లెత్తి
న అనంతంగా కన్పిస్తున్న నీలాకాశంవైపు చూశాడు. తెల్లటి మబ్బులు

గుంపులు గుంపులుగా కదిలి పోతున్నాయి. క్షణంసేపు వాటిని పరీక్ష
చూసి నిట్టూర్పు విడిచిన అతను మళ్ళీ అంతలోనే కళ్ళు క్రిందికి వాల్చాడ
బయటనుంచి నంబర్ 7 డబుల్ డెక్కర్ మహాకాయాన్ని వూపుకుంట
లోపలికి వస్తోంది. ఆశ, నిరాశ మిశ్రితమయిన దృక్కులతో దానివై
పరీక్షగా చూశాడు. ఎదురుచూస్తున్న వ్యక్తి చూచాయగా కన్పించిన
యింది. హఠాత్తుగా అతని కళ్ళు మరింత తీక్షణత్వం తెచ్చిపెట్టుకు
చురుగ్గా చూశాయి. మరుక్షణంలో వాటిల్లో అపూర్వమయిన కాంతివచ్చిం

ఆ కాంతికి కారణం-

క్రింద లోపలకి వచ్చిన అప్పుడే ఆగిన డబుల్ డెక్కర్‌లో నుం
మెల్లగా దిగుతున్న రకరకాల మనుష్యుల మధ్య వాళ్ళని తోసుకుంట
ఓ అమ్మాయి దిగింది. ఆ అమ్మాయిని చూస్తుంటే వయసు 20, 23 మధ్య
వున్నట్టుంది. శరీరం సన్నగా తీగ లావుంది. వయసు పెట్టిన మెరుపుతో
మిస మిసలాడుతున్న శరీర కాంతిని పైనుంచి పడుతున్న నీరెండ మరిం
కాంతివంతంగా చేసి చూపుతోంది. చెవులని కప్పేసేటట్టు వదులుగా వే
కున్న పొడుగాటి జడలో ఒకటి రెండు ముంగురులు గాలికి చెదిరి నుదు
మీదపడి నాట్యంచేస్తానంటున్నాయి. వాటిని విసుగ్గా ఎడంచేత్తో పైకి తో
కుంటోంది. అందంగా కన్పిస్తున్న ఆ కోలమొహంలో కొనదేలినముకు
పట్టుదలని చూపిస్తుంటే, గులాబీరేకుల్లా సున్నితంగా వున్న పెదవు
నవ్వటానికి సిద్ధంగా వున్నట్టున్నాయి. ఒకసారి ఎవరయినాసరే ఆ నల్ల
సోగ కళ్ళల్లోకి చూసే చాలు- జీవితాంతం వాటిని మర్చిపోదామన
మర్చిపోలేరు. ఆ కళ్ళలో సౌందర్యం అలాటిది.

బస్సు దిగిన ఆ అమ్మాయి ఎటూ చూడకుండా తలవంచుక
సరాసరి భవనం వైపు నడిచింది. చకచకా మెట్లెక్కింది. గబగబా అం
స్తులు దాటి పైన అతను నిలబడివున్న గదిలోకి వచ్చింది.

"సుజా!" కళ్ళనిండా ఆప్యాయత నింపుకుని రెండు చేతు
ఆత్రంగా జాచాడతను.

"రాజా!" ఒక్కసారి గట్టిగా వూపిరి పీల్చుకొని చుట్టూ ఎవరై
వున్నారేమోనని కళ్ళతో వెతికింది. అదృష్టవశాత్తు ఆ చుట్టు పక్క
కనుచూపు మేరలో ఎవరూ లేరు.

సుజాత హఠాత్తుగా ఆగి ఒకడుగు వెనక్కువేసి "మొదట ఇది చెప్పు" అంది.

"ఏదీ?"

"నువ్వు మీ మామయ్యతో పోట్లాడి, ఉద్యోగం వదిలేసి ఇంట్లోంచి వెళ్ళిపోయినమాట నిజమేనా?" అతని చేతులు క్రిందకు వాలిపోయినాయి.

"నీకెలా తెలిసింది?" అన్నాడు.

"ప్రపంచంలో వున్న ఘోరమైన విషయాల్లో ఇదొకటి. అయిన వాళ్ళ విషయాలు అప్తులకి ఆలస్యంగా తెలుస్తాయి. నువ్వు చెప్పకపోతే తెలియదనే కదూ నీ ఉద్దేశ్యం? నిన్న ఉదయం నాన్న పిలిచి చెప్పారు. నిజం చెప్పు! అవునా, కాదా?"

"నిజమే సుజాతా!"

"ఎందుకు మానెయ్యాల్సి వచ్చింది?"

"ఒక విధంగా చూస్తే కారణం చాలా చిన్నది."

"ఎంతచిన్నదైనా అదసలు నిప్పురవ్వ అయితేనేగా అంటుకునేది?"

"విషయం ఏమిటో చెప్తే నేను నిర్ణయించుకోగలను."

రాజా కోపంగా భుజాలెగరేశాడు. "రేపు ఆస్ట్రేలియా నుంచి ఇండియాకు రాబోతున్న క్రికెట్ జట్టుతో టెస్టుమాచెస్ ఆడడానికి నేను ఇండియన్ టీమ్‌కి కెప్టెన్‌గా సెలక్టు అయ్యాను అని మామయ్య కిష్టం లేదు."

"ఇది పాతపాటేగా- ఆయన వద్దంటం, నువ్వు వెళ్ళటం! ఇదివరకు జోన్‌మాచెస్ కోసం యెన్నిసార్లు ఇలా జరగలేదు?"

"ఈసారి వేరు సుజాతా! నేను మొట్టమొదటిసారిగా దేశానికి ప్రతినిధిగా నిల్చి ఆడబోతున్న మాచ్‌కెప్టెన్‌గా సెలెక్టవటం అంటే మాటలు గాదు."

"సరే! అందుకని?"

"అది మామయ్యకిష్టంలేదు. నేను మాచెస్ ప్రాక్టిస్ కోసం బోలెడంత టైమ్ వృధా చేస్తానని, అదంతా కంపెనీకి నష్టం అనీ ఆయన వుద్దేశ్యం. అక్కడికీ ఓపిగ్గా ఎంతో నచ్చచెప్పాలని చూశాను. వింటేగా! వద్దు, వద్దు. ఒకటేమాట."

"వద్దనడంలో ఆయన తప్పేముంది? రేపు కంపెనీకి లాభాలువస్తే నీకేగా?"

"అయితే? అందుకని మాచ్ వదులుకోవాలా? కంపెనీ ఎప్పుడూ ఉంటుంది. డబ్బెప్పుడైనా సంపాయించుకోవచ్చు! కాని జీవితంలో నాకిలాటి అవకాశం మళ్ళీ వస్తుందా? అయినా మనిషికి డబ్బేనా ప్రధానం? ఇంకేమి అవసరంలేదూ? ఇంతవయస్సు వచ్చింతర్వాత నాకేమి కావాలో నేను నిర్ణయించుకోలేనూ! ఆయనిష్టం వచ్చినట్టు ఆడటానికి నేనేం బొమ్మనా?"

"చిన్నప్పుడే తల్లీ-తండ్రీ పోతే కంటికిరెప్పలాచూసి పెంచి పెద్ద చేసిన ఆయనకి ఆ మాత్రం అధికారం లేదనా నీ ఉద్దేశ్యం?"

"ఉంది, కాదనను. కాని ఆ అధికారం నా వ్యక్తిత్వాన్ని చంపేస్తా నంటే ఎలా? అక్కడికీ ఈ ఒక్కసారి ఎలాగైనా ఒప్పుకోమని బ్రతిమాలాను. అసలు ఆయన్ని అడక్కుండా ఒప్పేసుకోవటం నా నేరమట."

"లేడీ టైపిస్టు సంగతి ఏమిటి మరి?" సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ అడిగింది సుజాత.

"అదా!" రాజా మొహం ఎర్రబడింది. "అది....అది.... నువ్వు అపార్థం చేసుకోకు సుజాతా! ఆ అమ్మాయికి ఇంట్లో చాలా యిబ్బందిగా వుండంటే, తండ్రికి పక్షవాతం వచ్చింది. మందులకీ దానికి చాలా అవుతోంది అంటే నేను ప్రతినెలా నా జీతంలోనుంచి యాభై రూపాయలు ఆ అమ్మాయికి యిస్తూ వచ్చాను. అది మామయ్యకి తెలిసి కోప్పడ్డాడు. ఆ అమ్మాయిని పిలిచి తిట్టి, అసలు ఉద్యోగంలోనుంచే తీసేశాడు."

"అందుకని నువ్వు వెంటనే మీ క్రికెట్ బోర్డు ఛైర్మన్ దగ్గర స్టెనోగా పని ఇప్పించావు. అంతేనా?"

అతని మొహం ఈసారి మరింత ఎర్రబడింది. "సుజా!" అన్నాడు.

"ఆ అమ్మాయిమీద నీకింత ఆపేక్ష ఎందుకు కలిగిందో నేను తెలుసుకోవచ్చా?"

"సుజా! భగవంతుడి సాక్షిగా నిజం చెబుతున్నాను. ఆమె పరిస్థితులు చూసి జాలి తప్ప నాకింకేం భావమూ లేదు. మగాడు, ఆడదానికి

సాయం చేస్తే అపురూమని పిచ్చి అనేక వికృతార్థాలు తీసే దేశంలో మనం ఉన్నమాట నిజమేకాని..."

"మనసులో మరే ఉద్దేశ్యంలేకుండా అయాచితంగా ఆడదానికి మగవాడు ఈ దేశంలో సాయం చెయ్యడు అన్నసంగతి నాకు తెలుసు. ఆ మాట చెప్పి నువ్వు నన్ను మభ్యపరచగలవా?"

"నా మీద నీకు నమ్మకం లేకపోతే అది కేవలం నా దౌర్భాగ్యం అనుకుంటాను. నిజంగా చెప్పు. నా మీద నమ్మకం లేదూ నీకూ?" అన్నాడతడు తీవ్రంగా.

అతని కళ్ళలో కన్పిస్తున్న తీవ్రతకి కొద్దిగా చలించిన సుజాత రెప్పవాల్చకుండా అతనివైపు చూస్తూ అంది: "కాబట్టే ఈ విషయాలు నా నుంచి దాచావని కోపంవచ్చినా పట్టించుకోలేదు! పట్టించుకోలేదు గాబట్టే నాన్నగారు తెలిస్తే వూరుకోరని తెలిసిగూడా నిన్నిలా రహస్యంగా కలుసుకోవటానికి వచ్చాను. పోనీ, అదంతాసరి. నువ్వెలాగైనా మీ మామయ్య దగ్గర మళ్ళీ చేరకూడదూ? ఎంతయినా తండ్రిలా పెంచిన మనిషి."

"అదే ఆయన ధీమా? చీటికీ మాటికీ ప్రతి చిన్న విషయానికి దాన్నే ఆయుధంగా తీసుకుని విసురుతాఉంటాడు నా మీద. మళ్ళీ చేరటానికి నాకేమీ అభ్యంతరంలేదు. కాని....కాని....ఆయన పెట్టిన షరతు నీకు తెలియదు."

"తెలుసు, అందులో తప్పేముంది? జరిగిన దానికి క్షమార్పణ కోరుకుని ఇంకెప్పుడూ అలా చేయనని వ్రాసి ఇమ్మన్నాడు-అంతేగా?"

"అంతేగా?" రెట్టించినట్టు అని, "అంతేగా అని తేలికగా తీసి పారేస్తున్నావు నువ్వు. అందులో నాకు నా వ్యక్తిత్వమే కన్పిస్తోంది. వ్రాసి ఇవ్వటానికి నేనేం పసిపిల్లవాడినా? అసలు నా మీద నమ్మకం లేని వాళ్ళకి వ్రాతలమీద ఎలా వస్తుంది? అయినా ఇప్పుడు ఇంత దూరం వచ్చాక క్షమార్పణ కోడుకోవటం అనేది అసలు అసంభవం!" అన్నాడు.

"మీ మామయ్యతో పోట్లాడితే ఫలితం ఏమిటో తెలుసా?" నిశ్చలంగా చూస్తూ అడిగింది.

"ఎందుకు తెలియదు? ఇకనుంచి నా చేతికి ఒక్క చిల్లికాని రాదు.

కట్టుబట్టల్తో వుండడానికి, తిండానికి వెదుక్కుంటూ నేను బజారులో నిలబడాలి. కాని నేనేం కుంటివాడిని కాదుగా! నాకోసం నేను ఆ మాత్రం సంపాయించుకోలేని అసమర్థుణ్ణి అనుకుంటున్నావా నువ్వు?" రాజా భుజాలెగరేశాడు.

"అంతేనా? అంతకంటే ఇంకేం నష్టపోవా నువ్వు?"

"ఇంకేం నష్టపోతాను?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇంకేం నష్టపోతాను!" సుజాత అనుకరిస్తూ వెక్కిరించింది.

"సుజా!"

"మీ మామయ్య వచ్చి జరిగినదంతా నాన్నకి చెప్తాడని తెలుసా? అదీ తెలియదా?"

"చెప్తే?" అర్థంగానట్లు చూశాడు.

సుజాత నుదురు కొట్టుకుని "ఖర్మ! ఆ మాత్రం అర్థంచేసుకోలేవూ? మా నాన్న చసే ఈ పెళ్ళికి ఒప్పుకోరు" అంది.

"మన పెళ్ళికి దీనికి ఏం సంబంధం వుంది?"

"ఎందుకు లేదూ? ప్రపంచంలో ఎవరయినా చూస్తూ చూస్తూ కూతుర్ని ఉద్యోగంలేని మనిషి కివ్వగలడా? అందులో మానాన్న!"

"నే నెప్పటికీ ఉద్యోగం లేకుండా ఇలాగే వుండిపోతానా?"

"అదంతా అనవసరం! మానాన్నకి అసలే నువ్వు క్రికెట్ ప్లేయర్ వని మొదలే ఇష్టంలేదు! చెప్పలేదూ? మా అత్తయ్య మొగుడు క్రికెట్ ఆటలో నడుం విరక్కొట్టుకుని బ్రతికున్నంతకాలం మంచంలో గడిపాడని!"

"అబ్బ- సుజా! ఆ సంగతి నువ్వూ మీ నాన్న కలిసి ఇప్పటికి కనీసం ఓ వందసార్లయినా చెప్పివుంటారు." వెన్నెముక జలదరిస్తుండగా అన్నాడు రాజా.

"ఇప్పుడెందుకు చెబుతున్నానో వినవేం? దీనికితోడు నువ్వు మీ మామయ్యతో పోట్లాడి ఇంట్లోంచి వెళ్ళిపోయావని నాన్నకి తెలిసింది. ఈ సందు చూసుకుని నాన్న ఇంకెవరితోనో ముడిపెట్టేస్తారు. నన్నసలు నీ మాటగూడా ఎత్తనివ్వరు."

సుజాతకి దుఃఖం ముంచుకొచ్చింది.

"నన్నేం చెయ్యమంటావో చెప్పు." దీనంగా అడిగాడు.

"నువ్వు తక్షణం వెళ్ళి మీ మామయ్యని క్షమార్పణ కోరుకో!"

"అది నావల్లగాదు సుజా! ఊరికే క్షమార్పణగూడా కాదు, అసలు జన్మలో క్రికెట్ జోలికి పోనని వ్రాసి ఇవ్వాలిట! అంతకంటె నా ప్రాణం తీసి యిమ్మంటే నాకు తేలిక అన్పిస్తుంది." పాంట్ జేబుల్లో చేతులు పెట్టుకుని కిటికీవైపు తిరుగుతూ అన్నాడు.

"నా మాట విను"లాలిస్తున్నట్టుగా దగ్గరగావచ్చి భుజంమీద చేయి వేస్తూ "ముందు పెళ్ళి అయిపోనీ, ఆ తర్వాత నీ ఇష్టం. నీ మాట నేనె ప్పుడయినా కాదన్నానా?" అంది మృదువుగా.

"వద్దు సుజా! వద్దు. పెద్దవాళ్ళని మోసం చెయ్యటం నాకిష్టంలేదు."

"అయితే ఆట వదిలేసుకో."

"చెప్పలేదూ, నావల్లకాదని!" బాధగా అన్నాడు రాజా. సుజాత ఒకడుగు వెనక్కు వేస్తూ "అయితే నాకీమాట చెప్పు! నీకు నేనుముఖ్యమా, ఆట ముఖ్యమా?" అంది.

"రెండూ." సుజాతవైపు తిరుగుతూ అన్నాడు.

"అంతేకానీ, నా కోసం దాన్ని వదలుకోలేవు కదూ?"

"ఆట మూలంగా నిన్నుకూడా వదులుకోలేను." తడుముకోకుండా వచ్చింది జవాబు.

సుజాత రెప్పవాల్చకుండా చూస్తూ నిలబడిపోయింది.

రాజా ఒకడుగు ముందుకువేసి సుజాత చేతిని అందుకోబోతూ "పోనీ, మీ నాన్నకి చెప్పి ఒప్పుకోకపోతే యింట్లోంచి వచ్చెయ్యి! రేపే రిజిష్టర్ మారేజ్ చేసుకుందాం" అన్నాడు.

సుజాత రాజా కందకుండా చెయ్యి వెనక్కు లాక్కుంటూ "అంత పని నేను చెయ్యగలననేనా నీ ఉద్దేశ్యం?" అంది.

"ఎందుకు చెయ్యలేవు?"

"ఎలా చేస్తాను! ఎలా చెయ్యగలను? ఆలోచించడం వరకే నేర్చుకుంది మాతరం. ఆలోచించినదల్లా ఆచరణలో పెట్టే ధైర్యం రావాలంటే మరో మూడు తరాలు ముందుకుపోవాలి."

"అందుకని—"

"అయినా పెద్దవాళ్ళని కాదని మనమెలా బ్రతుకుతాం? ఆసాహసం నాకు లేదు. నన్ను నువ్వు పిరికిదాన్నని హేళన చేసినాసరే? నాక్కావల్సిందల్లా, తెలిసిందల్లా నువ్వు కావాలి అనుకోవటం.అంతే—చెప్పు, నేకావాలా? వద్దా?"

అతనికి కోపం వచ్చింది "సుజా!" అన్నాడు బిగ్గరగా.

"ఉష్! ఎవరయినా వింటారు." సుజా చుట్టూ చూసింది.

"నన్నర్థంచేసుకో సుజా!"

"అయితే మాచ్ వదులుకోవన్నమాటేగా?"

"ఉహుఁ!" అడ్డంగా తల తిప్పాడు. ఆ మాట చెప్పటానికి ఒంట్లో వున్నశ కినంతా కూడదీసుకుంటున్నట్టు అతని మొఖమే చెపుతోంది.

"అంటే....అంటే.... నేనవసరం లేదన్నమాటేగా?"

సుజాత మోహం కోపంతో ఎర్రబడింది.

"కాదు సుజా! కాదు, కావాలి, ఎప్పటికీ కావాలి. ఈ జన్మకే కాదు వేయి జన్మలెత్తితే ఆ వేయి జన్మలు నువ్వు కావాలి."

"అంతేగాని, ఇప్పుడు నువ్వేం చెయ్యలేవు- అంతేనా! నా కోసం మాచ్ మానలేవు. కనీసం అబద్ధంకూడా ఆడలేవు. ఇహ నీ మనసులో నాకు దేంట్లో ప్రత్యేకతో చెప్పు?"

"అబ్బా! నన్ను చంపెయ్యకు" బాధగా కళ్ళు మూసుకున్నాడు.

"నువ్వంత బాధ పడక్కర్లేదులే! నే వెడ్తున్నా."

"సుజా!" రాజా అదుర్దాగా కళ్ళు తెరిచాడు.

"నే నెడుతున్నా."

"నా మాట విను."

"నా యీ ఒక్కమాట నువ్వు వింటే జీవితాంతం నీ మాటలన్నీ నేను వింటాను."

అతను మాట్లాడలేదు.

"వినవుగదూ! సరే" సుజాత వెళ్ళబోయి ఒక్కక్షణం ఆగి రోషంతోనూ, కోపంతోనూ మెరుస్తున్న కళ్ళతో"నీఅసలు స్వరూపం నాకిప్పుడు తెలిసింది. నువ్వింత స్వార్థపరుడివని తెలిస్తే, కనీసం వూహించనయినా వూహించగలిగివుంటే నీ నీడకూడా తొక్కేదాన్ని గాదు" అంది.

"సుజా!" అతను ఒకడుగు ముందుకు వేశాడు.

"నన్నా పేరుతో పిలవకు. ఈ క్షణం నుంచి సుజాత నీకు చచ్చిపోయింది. అయినా నీకిప్పుడు కావల్సింది సుజాత కాదుగా! గొప్పగా ఆడాడు అనే పొగడ్తలు, పేపర్లలో ఫోటోలు, పెద్దవాళ్ళతో పార్టీలు, ఫారెన్ వెళ్ళేందుకు అవకాశాలు, నీకు రాబోయే పేరు ప్రతిష్ఠలు ముఖ్యం గాని-వాటిమధ్య సుజాత మనసు ముక్కలయితే నీకెందుకు? చస్తే నీకెందుకు? అవును నిజమే! సుజాతని చేసుకుంటే నీకేం ఒరుగుతుంది?" అని క్షణంసేపు వూపిరి పీల్చుకుని "కాని....కాని నీకెందులోనూ కలిసిరాదు నా కన్నీళ్ళు నీకు శాపం గాకపోతే" అంది.

"సుజా!" రాజా వారిస్తున్నట్టు అరిచాడు.

సుజాత ఆగలేదు. అంటూనేవుంది- "ఇప్పుడు దేన్ని చూసుకుని నన్ను గడ్డిపరక విలువ లేకుండా తీసేస్తున్నావో, వేటికోసం నువ్వు ఆశల అలలమీద వూగుతున్నావో అవి నీకు ఎండమావులు కాకపోతే."

రాజా గుప్పెట్లు కోపం ఆపుకుంటున్నట్టు బిగుసుకున్నాయి.

"నువ్వంతా ఎదురు చూస్తున్న ఆ మాచెస్‌లో ఓడిపోకపోతే...." వాక్యం పూర్తికానేలేదు.

"నోర్ముయ్!" సుజాత చెంప చెళ్ళుమంది. రాజా కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి. "ఎంత ధైర్యం నీకు? నా మంచి కోరాల్సిన నువ్వు...." రాజా ఆగిపోయాడు. క్షణంసేపు ఇద్దరిమధ్య భయంకరమయిన నిశ్శబ్దం ఏర్పడింది. ఒకళ్ళని ఒకళ్ళు తీవ్రంగా చూసుకున్నారు. చూస్తుండగానే సుజాత కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. చెదిరిపోయి నీళ్ళు సుళ్ళు తిరుగుతూన్న ఆ కళ్ళని చూడగానే రాజా కోపం మంచులా చల్లబడిపోయింది. మైకం దిగిపోయింది. అప్పటికి తెలిసింది, తనెంత హీనమైన పని చేశాడో. వెంటనే రెండుచేతులూ జాచి 'సుజా!' అంటూ బలంగా దగ్గరకు లాక్కోబోయాడు. కాని అప్పటికే సుజాత మెరుపులా అతని చేతుల కందకుండా తప్పించుకుని గిరుక్కున వెనక్కు తిరిగి రివ్వున పారిపోయింది. వెనకనుంచి అస్పష్టంగా 'సుజా!' అన్న పిలుపు గాలిలో కలిసిపోయింది. స్థాణువులా నిలబడిపోయాడు. ఏం చేశాడు తను! ఏమైంది తనకి! ఇలా ఎందుకయింది? సుజాత గిరుక్కున తిరిగి

వెళ్ళిపోవటంలో చేతిలో జేబురుమాలు జారి క్రిందపడిపోయింది. రాజా వెంటనే వంగి దాన్ని చేతిలోకి తీసుకుని అక్కడినుంచి కదిలి గబాగబా కిందకువచ్చాడు.

అతను వస్తుండగానే నంబర్ 7 బస్సురావటం, అందులో సుజాత ఎక్కెయ్యటం జరిగిపోయింది. అతను దగ్గరగా వచ్చేసరికి బస్సు కదిలి వెళ్ళిపోయింది. "సుజా!" అన్న పిలుపు అతని పెదవులమధ్య ఆగి పోయింది. చాచిన చేతిలో జేబురుమాలు అలాగే మిగిలిపోయింది. వెళ్ళిపోతున్న బస్సులో సుజాత రాజాని చూస్తూనే గిరుక్కున మొహం తిప్పేసుకోవటం, చీరకొంగుతో కళ్ళు తుడుచుకోవటం కన్పించిన దృశ్యం పదునైన రంపంలా మారి అతని హృదయాన్ని నిర్దాక్షిణ్యంగా చీల్చసాగింది. సున్నితమైన దానిని, అతి ప్రియమయినదాన్నేదో హత్య చేసినట్టుగా బాధపడుతూ చిత్తరువులా నిలబడి పోయాడు.

o o o

సుజాత ఇంటికి వచ్చేసరికి తండ్రి హాల్లోనే ఎదురయినాడు.

"ఎక్కడికి వెళ్ళావమ్మా?"

"రేణు దగ్గరికి నాన్నగారూ!"

తనంటే ఏమాత్రం విలువలేని మనిషికోసం తండ్రితో అబద్ధం ఆడటం ఎంత హీనం!

"రేణు ఇంతకుముందే మనింటి దగ్గర్నుంచి వెళ్ళింది. నీకోసం వచ్చి చూసి చూసి వెళ్ళింది."

సుజాత పెదవి కొరుక్కుని తడబడుతూ "అలాగా!" అంది. మళ్ళీ వెంటనే తేరుకుంటూ "బాగుంది. నేనేమో అక్కడ తనకోసం ఇంకా వస్తుంది అంటూ ఎదురుచూస్తూ కూర్చున్నాను" అంది నవ్వుతెచ్చి పెట్టుకుంటూ.

"అమ్మాయీ! బావ బొంబాయి నుంచి వస్తున్నాడని టెలిగ్రాం వచ్చిందమ్మా!"

లోపలికి వెళ్ళబోతున్న సుజాత ఆగిపోయింది. "ఎప్పుడు?"

"ఇంతక్రితమే—ఇదుగో. పోన్లే, నేనే యింకా రమ్మని రాద్దామనుకుంటున్నాను" అంటూ టెలిగ్రాం కాతురు చేతికిచ్చి వెనక్కి జారగిల

బడుతూ "ఏమిటోనమ్మా! నిన్నో అయ్యచేతిలో పెట్టేస్తే నాకు నిశ్చింత!" అన్నారు.

సుజాత మౌనంగా టెలిగ్రాం అందుకుంది.

"బావ ఎలాగూ వస్తాడు. కాబట్టి—యిదేదో ఈసారి కదిపి తేల్చే యాలి. వాడి కిష్టమయితే అత్తయ్య దేంలేదు" మెల్లగా అన్నారాయన.

ఆయన ఊహించుకున్నట్టు సుజాత రివ్వున వెనక్కు తిరగలేదు; నవ్వి దగ్గరగా రాలేదు. "నా పెళ్ళి అయిపోయి నేను వెళ్ళిపోతే తమ్ము డిని, మిమ్మల్ని చూసేదెవరు నాన్నగారూ! నా కిప్పుడేం తొందర?" అన లేదు. వినీవిననట్టు మెల్లగా లోపలికి వెళ్ళిపోయింది. ఏదో అయింది. ఇంత నిదానమే! ఇంత మార్పే! కళ్ళజోడు తీసి తుడుచుకుంటూ కూతురు వెళ్ళినవైపే చూస్తూ కూర్చుండిపోయారాయన.

గదిలోకి రాగానే చేతిలో టెలిగ్రాం టేబిల్‌మీద గిరాటేసి ప్రక్క మీద కుప్పలా కూలిపోయింది. చాలా సేపటి నుంచి నిగ్రహించుకుంటున్న ఏడుపు ఒక్కసారి కట్టలు తెంచుకుంది. రాజాకి తనంటే ఇంత నిర్లక్ష్యం అని కల్లోకూడా అనుకోలేదు. అయినా తనేమంది? ఆట పూర్తిగా మానుకో మనలేదుగా! ఆమాత్రం అర్థం చేసుకోలేనంత మూర్ఖుడా! అంటే........ అంటే అసలు అతని దృష్టిలో తనకి ఏమాత్రం విలువలేదు. అంతేగా! ఈ బావకూడా యిప్పుడే రావాలా ఖర్మ గాకపోతే— ఇదేదో పరీక్షలా వుంది.

"పోన్లే! రానీ, మంచిదే! మంచి సమయానికే వస్తున్నాడు. రాజాకి ఈర్ష్య కలిగించవచ్చు. నువ్వేగాదు; నిన్ను గూడా నేను నిర్లక్ష్యంగా చూడగలను- అని నిరూపించవచ్చు." కసిగా అనుకుంది.

సుజాతకి జేబురుమాలు పారేసుకువచ్చిన విషయం గుర్తుకు వచ్చింది. అతని దగ్గర ఏం పారేసుకు వచ్చింది తను? మనసా? సంతో షమా? లేక అదృష్టమా? ఏమైనా ఫర్వాలేదు. బావ సాయంతో మళ్ళీ పొందవచ్చు. ఓటమి ఒప్పుకోని సుజాత మనసు కసితో ఎదురుతిరిగింది.

o o o o o

బొంబాయినుంచి వస్తున్న బావగారిని రిసీవ్ చేసుకోవటానికి హడా వుడిగా తయారవుతోంది సుజాత. ఇంతలో వాసు పరుగెత్తుకొచ్చి

"అక్కా! ఫోన్ వచ్చింది నీకు" అని ఎంత స్పీడ్‌గా వచ్చాడో, అంత స్పీడ్‌గానూ వెళ్ళిపోయాడు. "ఎవరు" అని అడిగే అవకాశమే యివ్వలేదు వాడు. జుట్టుని మెలితిప్పి పైకి ముడేసుకుని కుడివైపు చెంప ప్రక్కగా పెద్ద గులాబిని పిన్నుతో గుచ్చుకోబోతున్న సుజాత ఆగి పువ్వు అలాగే పట్టుకుని ఫోన్ దగ్గరికి వచ్చింది.

"హలో!"

"హల్లో! సుజా!" అవతలనుంచి ఆత్రంగా విన్పించింది కంఠం.

'సుజా' అన్న పిలుపుని అంత అందంగా పిలువ గలిగిన మనిషి ఒక్కడే!

"సుజా! నేను రాజాని."

"తెలుసు. ఏం కావాలి?"

"నీతో మాట్లాడాలి."

ఫోన్ వైర్ సాగదీస్తూ నిలబడిపోయింది. అతను మాట్లాడుతున్నాడని కలిగిన ఆనందాన్ని అవమానం, రోషం జంటగా మీదపడి చంపేశాయి.

"సుజా! ఎక్కడయినాసరే! ఒక్క పది నిమిషాలు...." ప్రాధేయ పడుతున్నట్టు అడుగుతున్నాడు రాజా.

"ఏమ్మా! ఇంకా కాలేదూ? టైమయిపోతోంది." హాల్లోంచి తండ్రి కేక విన్పించింది.

"ప్లీజ్, సుజా!"

"మీ మామయ్యని క్షమార్పణ కోరుకోవటానికి సిద్ధపడ్డట్టేనా?"

"సుజా!" అతను ఆగిపోయాడు. ఆ స్వరాన్నిబట్టే దాని కతడు సిద్ధంగా లేడని స్పష్టంగా తెలుస్తోంది.

ఇద్దరిమధ్యా నిశ్శబ్దం ఏర్పడింది.

"సరే. నాకు వీలుకాదు. అయినా మనిద్దరిమధ్యా మాట్లాడాల్సింది మటుకు యింకేముంది?"

"సుజా!"

"మా బాప బొంబాయినుంచి వస్తున్నాడు. నేను రిసీవ్ చేసుకోవ.

డానికి వెడుతున్నాను. నీకే మాత్రం బుద్ధున్నా అతనెందుకు వస్తున్నాడో గ్రహించ గలుగుతావు."

సుజాత టపీమని రిసీవర్ పెట్టేసింది కానీ అలాగే కావాలి. ఇందులో తనొక్కతే కాదు,అతను గూడా బాధపడి తీరాలి. ఇప్పుడుగాదు, రేపు ఆటలో వోడిపోతే, అప్పుడు మనశ్శాంతి ఆటకోసం తనను వదిలేసుకుని జీవితంలోగూడ ఓడిపోవాలి. అప్పుడు తనకి తృప్తి రోషంతో నరనరం మెలిదిరిగిపోతున్న సుజాత రోజుకు కనీసం పదిసార్లయినా రాజా ఆటలో వోడిపోవాలని,లేకపోతే ఆటకి ఆటంకంరావాలనీ కోరుకుంటోంది. అద్దం దగ్గరికి తిరిగి వచ్చినప్పుడు పువ్వుకోసం చూసుకుంటే లేదు.రాజా మాట్లాడుతున్న కోపంతోఅందమైన పువ్వుని కాస్త నలిపి నాశనం చేసింది. సుజాత కెందుకో యిది మంచి దృష్టాంతంగా కన్పించలేదు.

బొంబాయినుంచి వచ్చిన ప్లేన్‌లోనుంచి దిగివస్తున్న మాధవరావుని చూసి సుజాత నీళ్ళు కారిపోయింది. ఎవరితను? బావే! రెండు సంవత్సరాల క్రితం తెల్లగా వోమాదిరి పొడుగుతో, దానికి తగిన లావుతో నాజూకుగా వుండే బావేనా ఈ మాధవ్! అతనికీ యితనికీ అసలు పోలికేలేదు. మనిషి మరింత తెలుపయ్యాడు. పొడుక్కి మించిన లావు వుండడంవల్ల గుండ్రంగా, అడ్డంగా కన్పిస్తున్నాడు. మనిషిని చూస్తుంటే తెల్లగా పండిన జాంపండు గుర్తుకొస్తోంది.

"హల్లో! సుజా! నువ్వే?ఎంత మారిపోయావు" అన్నాడునవ్వుతూ. నవ్వుతుంటే వొళ్ళంతా కుదిపినట్టు కదులుతోంది.

"నువ్వుగూడా" అంది సుజాత. భగవాన్!ఈ మనిషితోనా నా జీవితాంతం గడపాల్సింది! ఎలా భరించటం, పోనీలే అందంగా వున్న రాజా ఏం ఉద్ధరించాడు? మనిషిలో శరీరం కంటే మనసుని గుర్తించటం మంచిదేమో! — అందులో ముఖ్యంగా ఆడపిల్లలకి.

"నీకోసం ఏం తెచ్చానో చెప్పుకో" వూరిస్తున్నట్టు అన్నాడుమాధవ్.

"ఏమిటది?"

"చెప్పుకో?"

"చెప్పులా?"పరధ్యాసగాఅడిగింది.రాజాఈపాటికిఏంచేస్తుండవచ్చు!

"కాదు."
"పోనీ-చీరె?"
"ఉహుఁ!"
"పుస్తకాలా!" ఓడిపోవడం ఇష్టంలేక ఊహించటానికి ప్రయత్నిస్తూ అంది.
"ఉహుఁ కాదు."
"మరింకేమిటి?" విసుగ్గా అడిగింది.
"ఓడిపోయావా?"
సుజాత ఓడిపోయానన్నట్టు తలూపింది.
"స్వీట్సు."
"స్వీట్సా?"
"అవును. 'బాంబే హోమ్' అని బొంబాయిలో బాగా పేరున్న షాపులే; నీకోసం ప్రత్యేకంగా,తాజాగా ఆర్డర్ చేయించి తీసుకొచ్చాను."
సుజాతకి నవ్వాలో ఏడవాలో తెలియదు."స్వీట్స్ మాకు దొరక్కపోతే గదా" అంది నిరాశగా.
"అంత మంచివి దొరకవని తిన్నతర్వాత నువ్వే ఒప్పుకుంటావు."
సుజాత మాట్లాడలేదు. అదే రాజా అయితే రాజాకీతనకీ ఎన్నివిషయాలలో కలిసిపోయింది! ఇంత ఆత్మీయతని రాజా ఎలా తుంచి పారేయగలిగాడు? లేదు. తుంచిపారేస్తే మళ్ళీ ఫోనెందుకు చేస్తాడు. ఎంతయినా తనంత నిర్లక్ష్యంగా మాట్లాడకుండా వుండాల్సింది. సుజాత కళ్ళలో నీళ్ళు తిరిగాయి.జరిగినదానికి అతను పశ్చాత్తాపపడుతున్నాడని ప్రత్యేకించిఅతను స్వయంగా చెప్పాలా? తనా మాత్రం అర్థంచేసుకోలేదూ! కాని....కాని.... అంత నిర్లక్ష్యంగల మగవాడిని చేసుకుని ఏ ఆడదయినా సుఖపడగలదా?
మాధవ్ సమక్షంలో రాజాని మర్చిపోవాలి అనుకున్న సుజాతకి అది అసంభవం కాగా, పైనుంచి ప్రతిక్షణం మాధవ్ మాటలకీ, రూపానికీ, చేతలకీ, రాజాని ప్రక్కన నిలబెట్టి మనసు నిశితంగా చూస్తుంటే రాజానే గెలుస్తున్నాడు. మాధవ్‌కి తిండి మీదున్న ధ్యాస నేనిమీదా లేదని వచ్చిన రెండురోజుల్లోనే అర్థమైపోయింది. "బావా! కొంచెం తినటం తగ్గించుకో రాదూ!ఒళ్ళు మరీ పెరిగిపోతుందేమో?" అంటే, "పోదూ! నేనేమన్నా

సినిమాల్లో వేషం వేయబోతున్నానా! నా వళ్ళు నేను మోయలేనంత బాధ వచ్చినప్పుడు చూస్తాను" అనేవాడు. బాధపడుతూ అయినా శరీరం మోసాడుగాని, తినటం మాని బాధపడడు అనుకుంది. మాధవ్‌కీ రాజాకీ శరీరాకృతిలో ఎంత వ్యత్యాసం!

మధ్యాహ్నం కొత్తవల్ల టామీ వెంటపడ్డప్పుడు భయంతో మాధవ్ పరిగెత్తుతుంటే యెంతో భయంకరంగా వుంది! అదే రాజా అయితే? రాజా ఎప్పుడూ ఆడుతుంటాడు కాబట్టి సునాయాసంగా పరిగెత్తగలడు. అలా ప్రతిదానికి సుజాత శక్తి అంతా కూడదీసుకుని మాధవ్‌ని గురించి ఆలోచించాలని ప్రయత్నిస్తే మనసు యెదురు తిరిగి రాజా దగ్గరికి పారిపోయేది. రాజాని మరచిపోవాలంటే ఏం చెయ్యాలి? స్వెట్టర్ అల్లుకుంటూ కూర్చుని ఆలోచిస్తున్న సుజాత దగ్గరికి "సుజా!" అంటూ మాధవ్ లోపలకి వచ్చాడు.

అతనికి ఒకచేతినిండా స్వీట్ పాకెట్స్, రెండో చేతిలో యాపిల్స్, ద్రాక్షపళ్ళ బుట్ట వుంది.

"అబ్బ! బావా! నన్ను పేరుతో పిలువకు!" అంది విసుగ్గా.

"ఎందుకని? చక్కగా సుజా అన్న పిలుపు కాజాలా వుంది. కాజా యెంత బాగుంటుందో తెలుసా?"

"తెలియదు. కాని నన్నా పేరుతో పిలవవద్దు. ఇదివరకు ఒక స్నేహితుడు నన్నా పేరుతో పిలిచేవాడు, అతనిప్పుడు లేదు."

"చచ్చిపోయాడా? అయితే నేను కూడా పిలువను." భయంగా అన్నాడు.

"అబ్బబ్బ! ఛీఛీ! అదేంమాట! ఇంకేదయినా నువ్వు స్వయంగా పెట్టుకో!" త్రుళ్ళిపడుతూ అంది.

"స్వయంగానా? అంటే నా కిష్టమయిందా?" మాధవ్ క్షణంసేపు కళ్ళెత్తి పైకిచూసి సీరియస్‌గా ఆలోచించి వెంటనే చిటికెవేసూ—

"ఆఁ! కరెక్టు. బాసంది అంటే నాకిష్టం. బాసంది అని పిలుస్తాను" అన్నాడు.

"సరే." ఏ మాటెత్తినా తిండివైపు తిప్పే ఈ మనిషిని మార్చటం ఎలా?

"సాయంత్రం పబ్లిక్ గార్డెన్‌కి పోదాం బావా!" అంది ప్రసంగం మారుస్తూ.

"ఓ కె" అన్నాడు అతను.

"చూడు-నీ బట్టల్లో మంచివి చూసి నే సెలక్టు చేస్తాను, సరేనా?"

"మా అమ్మ నీకు వుత్తరం రాసిందేమిటి?" అన్నాడు మొహం అదో మాదిరిగా పెట్టి.

"లేదే? ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగింది.

"నేనెప్పుడు యే బట్ట వేసుకోవాలో తనే సెలక్టు చేస్తుంది. నాకేం తెలియదని మా అమ్మ ఉద్దేశ్యం. అందుకని—"

ఖర్మ! మనసులోనే నెత్తిబాదుకుంది సుజాత. ఈ పెద్దమనిషితో జీవితాంతం కష్టసుఖాలను ఎలా పంచుకునేది!

ఇంతలో వాసు "అక్కా! సావిత్రమ్మగారు ఏమిటో పంపించారే" అంటూ లోపలికి వచ్చాడు. వాసు వెంటే వచ్చిన నౌకరు ఓ పళ్ళెం సుజాతముందు పెట్టాడు.

"ఆరి కోడలుగా రొచ్చారండి! సారె." చెప్పి రంగడు వెళ్ళి పోయాడు.

"ఏమిటివి? స్వీట్లు లాగా వున్నాయ్!" మాధవ్ పళ్ళెంమీద కప్పిన పూలగుడ్డ తీసి చూశాడు.

"బావా!" సుజాత వారించే లోపలే-

"అబ్బో! చలిమిడి ఎంత బాగుంటుందో తెలుసా?" మాధవ్ పళ్ళెంలో వున్నది తీసుకుని వుండలుగా చేసి మింగసాగాడు,

సుజాత పెద్ద పెద్ద కళ్ళతో అతనివైపు చూస్తూ రాయిలా బిగుసుకుపోయింది.

o o o

సాయంత్రం మాధవ్‌ని మల్లెపువ్వులాంటి బట్టలు వేయించి పబ్లిక్ గార్డెన్‌కి తీసుకెళ్ళింది. మంచి బట్టలేసుకుంటే, మాట్లాడకుండా వుంటే దూరంనుంచి చూస్తే మాధవ్ విగ్రహం బాగానే వుంటుందని సుజాతకి తెలుసు. మాధవ్‌ని కావాలని అలా తీసుకెళ్ళడంలో అసలు ఉద్దేశ్యం అక్కడెక్కడన్నా రాజా కన్పిస్తాడేమోనని! తనంటే ఏ మాత్రం లెక్క-

లేదని; అసలు మర్చిపోయిందని రాజాకి గుర్తుచేసి అతనిలో ఈర్ష్యని రగిలించాలని సుజాత మనసులో మారుమూల చిన్నకోర్కె. సాయంత్రం పూట అలా షికారుగా ఆ ప్రాంతాలకి రాజా రావచ్చుననే ఆశ మాధవ్‌ని వెంటబెట్టుకుని తీసుకెళ్ళేలా పురిగొల్పింది.

ఇద్దరూ వచ్చి కూర్చున్న కొద్దిసేపటికే మాధవ్ దూరంగా కన్పిస్తున్న కేఫ్‌ని చూస్తూ "వెళ్ళి ఓ కప్పు కాఫీ తాగివద్దామా?" అన్నాడు.

"ఇంత క్రితమేగా టిఫెన్‌తిని కాఫీ తాగివచ్చాం" అంది సుజాత ట్రాన్సిస్టర్ తిప్పుతూ.

"ఇంత క్రితమెక్కడా! మనం తీసుకున్నది నాలుగు గంటలకి. ఇప్పుడు ఆరు కావస్తోంది" మాధవ్ ఆశ్చర్యంగా అన్నాడు.

"నీక్కావాలంటే వెళ్ళి తాగిరా! నేను రాను." కోపంగా అంది.

"బాసందీ! నీకు బొత్తిగా తిండంటే గిట్టదు. ఏదో టైమ్‌కి కాస్త అన్నం కెలుకుతావు. అంతే! చూస్తున్నాగా నేను. అబ్బే! లాభంలేదు. నువ్వు కాస్త లావు కావాలి."

"పోనీ నువ్వు సన్నబడకూడదూ?"

"ఇంతకంటే సన్నంవుంటే ఏం బాగుంటుంది?"

మాధవ్ లేచి కేఫ్‌వైపు వెళ్ళిపోయాడు. సుజాత మొహంలో కఠినమైన భావం ఒకటి తొంగిచూసింది. ఇలాటివాళ్ళని పెళ్ళి చేసుకునేకంటే అసలు ఆజన్మాంతం కన్యగా వుండిపోవటం వేయిరెట్లు సుఖం. ఒళ్ళో పెట్టుకున్న ట్రాన్సిస్టర్ వింటున్న సుజాత చూపులు దూరంగా అక్కడక్కడా తిరుగుతున్న మనుషుల్ని పరీక్షగా చూస్తున్నాయి. రాజా ఏం చేస్తుంటాడీపాటికి? క్షణం తీరిక దొరికితే చాలు. మనసు ఇది ఆలోచిస్తుంది. మళ్ళీ అతను జ్ఞాపకం వస్తేనే మండిపడుతుంది. దూరంగా తిరుగాడుతున్న ఆ భార్యాభర్తల్లో అతనెవరో వెనకనుంచి చూస్తే రాజా లాగానే వున్నాడు. ఇద్దరూ ఏదో మాట్లాడుకుంటూ ప్రక్క ప్రక్కన నడుచుకుంటూ వెడ్తున్నారు. మెల్లిగా చీకట్లు వ్యాపిస్తున్నాయి. గూళ్ళకి చేరే పక్షుల కలకలం ఎక్కువైంది. దూరంగా నడుస్తున్న వాళ్ళిద్దరూ అటునుంచి తిరిగి ఇటేవస్తున్నారు. అతనెవరో రాజాలానే వున్నాడు. తమాషా! ఈ ప్రపంచంలో మనిషిని బోలిన మనుష్యులెంతమంది! అతన్ని దగ్గ

రగా చూడాలని సుజాత లేచినిలబడింది. అతను గూడా పరీక్షగా యిటే చూస్తున్నట్టనిపించిన సుజాత సిగ్గుపడి వంగి ట్రాన్సిస్టరు అందుకుంది. తన రాజాని తప్ప పరాయి మగవాళ్ళని పరీక్షగా చూడటం ఇదే మొదటి సారి. అతను గబగబా సుజాతవైపు అడుగులు వేశాడు.

"సుజా!" అన్న అతను రాజా పోలిన మనిషి గాదు-స్వయంగా రాజానే! హఠాత్తుగా అతనే కన్పించటంతో ఏం మాట్లాడాలో తోచలేదు.

"ఎవరు?" కొద్దిగా వెనకబడిన ఆ అమ్మాయి రాజాని చేరుకుంటూ అదుర్దాగా అడిగింది.

క్షణంసేపు సుజాత చూపులు రాజాని, ఆ అమ్మాయిని మార్చి మార్చి చూశాయి.

"సుజా! నేను చెప్పలేదూ-మామయ్య తీసేశాడని లేడీటైపిస్టు...." రాజా వాక్యం పూర్తిగానేలేదు, సుజాత గిరుక్కున తిరిగివెళ్ళి కారులో కూర్చుని స్టార్టుచేసింది. కారు ముందుకు వచ్చేస్తుంటే అర సెకనుసేపు కళ్ళు తిప్పి వాళ్ళవైపు చూసింది. రాజా నిలబడిపోయి వున్నాడు. ఆ అమ్మాయి ఏదో అడుగుతోంది. సుజాత హృదయం ఈర్ష్యతో భగ్గుమంది. ఏ ఆయుధం తీసుకుని అతన్ని బాధపెట్టాలనుకుందో-అదే అనుకోకుండా యెదురు తిరిగి తన మనసులో గుచ్చుకుంది. ఎంత దురదృష్టం?

ఇంటికి వచ్చినతర్వాతగానీ మాధవుని కేఫ్‌లో వదిలేసి వచ్చినట్టు గుర్తురాలేదు సుజాతకు.

o o o

అనుకున్న రోజు వచ్చింది. మొదటి ఆట మద్రాసులో మొదలైంది.

"విజయం ఎవరికైనా ఒకటే! సరదా కోసం ఆడుతున్నాం అంతే. విజయం మాకు దొరికితే గర్విస్తాం- మీకు దొరికితే మిత్రులుగా సంతోషిస్తాం" అన్నాడు ఆస్ట్రేలియన్ కెప్టెన్.

"చూశావా ఆ మాటల ధోరణి! గెలుపెలాగూ మాదే!- అన్నట్టుంది" అన్నారెవరో.

"ఎంత గర్వం!" ఇంకెవరో అన్నారు.

"అది గర్వంకాదు. స్వశక్తిమీద నమ్మకం, ధీమా-" అని ఒకళ్ళు బలపరిచారు.

"వీళ్ళ మొహం! మనవాళ్ళేం ఆడ్తారు వాళ్ళతో? వాళ్ళకెంత ప్రాక్టీసు!"

"మనవాళ్ళెంత! పులితో పిల్లి తలబడ్డట్టు." ఇంకో అతను జ్యోతిష్యం చెప్పాడు.

"చూద్దాంగా! ఈ సారి మన టీమ్‌లో ఉద్దండులున్నారు." ఒకతను ఆశ కన్పరిచాడు.

ప్రతిచోట తమ కనుగుణ్యంగా పడే టాస్ ఈ రోజు వ్యతిరేకంగా పడటంతో ఆస్ట్రేలియన్ కెప్టెన్ ఉలిక్కిపడ్డాడు.

"బాటింగ్ మాది." అన్నాడు రాజా నిశ్చలంగా కొద్దిగా భుజా లెగరేసి.

ఆట మొదలయింది. మొదట వచ్చిన ముగ్గురూ ఎక్కువ స్కోర్ చెయ్యకుండానే వెంట వెంటనే ఔటు అయిపోయినారు.

"చూశావా! నేను చెప్పలా. ఎలా ఎగిరిపోతున్నారో చిలకల్లా" అన్నాడు పక్షపాతి.

"ఆగాగు. అసలయినవాళ్ళంతా ముందేవున్నారు. అడుగో, కెప్టెన్ రాజా వస్తున్నాడు" అన్నాడు ఆశావాది నీరసంగా. నాలుగో బాట్స్‌మాన్‌గా రాజా వచ్చాడు. "నిన్నెగరగొట్టటం యెంత సేపులే" అన్నట్టు చూశారు ఎదుటివాళ్ళు.

రాజా వచ్చిన ప్రతి బాల్‌ని చురుగ్గా ఎదుర్కొంటున్నాడు. మెల్లిగా స్కోరు పెరగటం మొదలు పెట్టింది. అవతలవాళ్ళు మొహాలు చూసుకున్నారు. ఆస్ట్రేలియన్ కెప్టెన్ బౌలింగ్ చేసే అతనికి కన్నుగీటి సౌజ్ఞ చేశాడు.

బౌలింగ్ చేసే అతను ఈసారి తెలివిగా యెవరూ ఊహించని విధంగా బాల్ విసిరాడు. చూసేవాళ్ళు రాజా బాల్ మిస్ అయాడనే అనుకున్నారు. కాని ఏ మాత్రం తొణకని రాజా దానికోసమే సరిగ్గా ఎదురు చూస్తున్నట్టు చులాగ్గా కొట్టేశాడు బంతిని. బాల్ వెళ్ళి బౌండరీ లైన్ దాటి పడింది. అంపైర్ సిక్స్‌రన్స్ డిక్లేర్ చేసేశాడు.

జనంలో ఒక్కసారి ఈలలు, కేకలు లేచినాయి. చప్పట్లు మిన్ను ముట్టాయి. బౌలింగు చేసే అతను ఎన్ని సార్లు బాల్ విసిరేసే పద్ధతిని మార్చినా లాభం లేకపోయింది. బౌలర్స్ మారుతున్నారు. రాజా స్కోరు పెరుగుతూనే వుంది. రాజా రన్స్ తీసినప్పుడల్లా, స్కోరు పెరిగిన కొద్దీ జనంలో కోలాహలం ఎక్కువ కాసాగింది.

ం ం ం

గదిలో కూర్చుని పూసలబాగ్ అల్లుకుంటున్న సుజాతకి హాల్లోంచి విన్పిస్తున్న రేడియో కామెంటరీ ఇష్టంలేకపోయినా వింటూనే వుంది. రేడియో చుట్టూ వాసూ, పదిమంది స్నేహితులు పోగయి కూర్చుని వున్నారు. ఉన్నట్టుండి రేడియోలో పెద్ద గోల, చప్పట్లు, వాటిమధ్య తారస్థాయిలో అరుస్తున్న కామెంటరీ, దాంతో ఒక్కసారి వాసూ వాళ్ళంతా "ఓఁ" అంటూ చప్పట్లుకొట్టి పెద్దగా అరవటం విన్పించింది.

"ఏమిట్రా అది, ఏమైంది, రాజా ఔట్ అయాడా?" సుజాత హాల్లోకి పరుగెత్తుకొచ్చింది.

"ఔట్ అయాడా! ఛీ, అపశకునం" వాసు స్నేహితుడు వినలేనట్టు చెవులు మూసుకున్నాడు.

"అక్కా, అక్కా! రాజా-మన రాజా సెంచరీ చేశాడు." వాసు డ్యాన్స్ చేస్తున్నాడు.

"నీ మొహం. అప్పుడే ఏమైంది? ఆంధ్రులది ఆరంభ శూరత్వం-అరవకుండా వినకపోయారంటే రేడియో కట్టేస్తాను. జాగ్రత్త! వెధవ గోలా మీరు." సుజాత గదిలోకి తిరిగివస్తుంటే వెనకనుంచి వాసు స్నేహితుడు రహస్యంగా "మీ అక్కకి క్రికెట్ అంటే ఇష్టంలేదా?" అన్నాడు.

"ఇష్టంలేదా! అసలు ఆ రాజా మా అక్కకి ప్రాణస్నేహితుడు" వాసు సగర్వంగా చెప్పుకున్నాడు.

గదిలోకి వచ్చి కూర్చున్న సుజాతకి ఏడుపొచ్చినంత పనయింది. కళ్ళముందు కన్పిస్తున్న ఆకుపచ్చ, నీలం, గులాబీ, ఎరుపురంగు పూసల మధ్య రాజా మొహం విజయగర్వంతో మెరుస్తూ తనని వెక్కిరించి నట్టుంది. అప్పుడే ఏమైంది? ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆటగాళ్ళు ఆస్ట్రే

లియన్స్. వాళ్ళచేతుల్లో గెలవటం అంటే మాటలా! ఇండియన్స్‌కి ఉత్సాహం ఇవ్వటానికి వాళ్ళు తేలికగా ఆడుతున్నారేమో!

నాలుగు రోజులు గడిచిపోయినాయి. ఎవరి నోటవిన్నా దీన్ని గురించే. ఏ పేపర్లో చూసినా ఈ గోలే! పైనుంచి సుజాతకి, రాజాకి మధ్య గల ఆత్మీయతని గుర్తించిన కొందరు దగ్గరి స్నేహితులు కంగ్రాచ్యులేషన్స్ చెప్తూ ఫోన్‌కాల్స్. ఎటువైపుచూసినా రాజానే! సుజాతకి వెర్రెత్తిపోతోంది.

అయిదవరోజు అయిపోయింది. రాజా పంతం నెగ్గించుకున్నాడు. గెలుపు ఇండియాకే లభించింది.

రేడియోచుట్టు మూగిన వాసు, స్నేహితులు ఆనందం పట్టలేక చేతులు కలుపుకుని గ్రూప్‌డాన్స్ మొదలుపెట్టారు.వాళ్ళ కేకల్తో హాలంతా అదిరిపోతోంది.

సుజాత గబగబా లేచివచ్చి వాసు వీపుమీద ఒక్కటి చరిచి "బుద్ధి లేదూ! తల నొప్పితో చస్తుంటే ఏమిటా గోల?" అని అరచింది. అనుకోకుండా కలిగిన ఈ అవమానానికి వాసు స్నేహితులు భయపడి దూరంగా పారిపోయి నిలబడ్డారు.

"చెబున్నా రేడియో పెట్టావంటే చేతులు విరక్కొడ్తా!" సుజాత రేడియో ప్లగ్ వూడపీకి తీసుకెళ్ళి, తన గదిలో పెట్టుకుని తలుపులు భళ్ళున మూసుకుంది.

గెలుసాడు! గెలువనీ! గెలుస్తే కళ్ళింకా నెత్తి నెక్కుతాయి. అసలేం లేనప్పుడే తనమాట ఖాతరు చేయలేదు. ఇప్పుడసలు కంటికి కనిపిస్తుందా-వూహల్లో నిలుస్తుందా?పట్టరాని కోపంతో ఒళ్ళు మండిపోతున్నా-మనసులో ఎక్కడో మూలగా "పోన్లే! గెలిచాడు. తనన్న మాటలు నిజంగాలేదు-అంతేచాలు" అన్పించి తృప్తి కలగసాగింది.

మాచ్ బొంబాయిలో మొదలయింది. మద్రాసులో దెబ్బతిన్న ఆస్ట్రేలియన్స్ ఒకళ్ళని ఒకళ్ళు ఒళ్ళు దగ్గర పెట్టుకుని ఆడాలన్నట్టు హెచ్చరించుకున్నారు. వాళ్ళ పట్టుదల చూసి అంతా ఈసారి ఇండియా ఓడిపోక తప్పదు అనుకున్నారు. ఇండియన్ టీమ్ ఆస్ట్రేలియా టీమ్‌కి ఏమాత్రం తీసుపోవడం లేదు. రాజా మెరుపులా ఆడ్తున్నాడు-అతని

ఆప్యాయతతో గూడిన హెచ్చరికలు, ఆ ఆడేటీరు జట్టులో మిగతా వాళ్ళకి ధైర్యాన్ని కలిగింపజేసి ఉత్సాహాన్నిస్తున్నాయి. అందరూ ఇక్కడ గూడా గెలిచితీరాలని పట్టుదలగా ఆడుతున్నారు.

బొంబాయిలో గూడా ఆట మొదలై మూడురోజులు గడిచిపోయి నాయి. రెండుదేశాలమధ్య పోటీ మాంచి తీవ్రంగా వుంది. ఏ ఇంట్లో జూసినా రేడియోలోంచి కామెంటరీ బిగ్గరగా ఫుల్ వాల్యూమ్‌లో విన్పిస్తోంది. సుజాత వద్దనుకుంటూనే రేడియో వింటోంది. వినకుండా వుండ లేకపోతోంది. ఈ పేరు ప్రతిష్ఠలతో రాజాకి తనకి మరింతదూరమైపోయి నట్టుగా వుంది. కళ్ళముందు మాటిమాటికీ ఆ రోజు తనని అర్థం చేసుకో అన్నట్టు వ్యథాపూరితమైన కళ్ళతో వాదిస్తున్న రాజా మొహమే కన్పిస్తోంది. ఆరోజు తనకెందుకంత ఆవేశం వచ్చింది? ఒకమాట అంటే దానికిక తిరుగులేదనే రాజా వ్యక్తిత్వం గురించి తనెలా మర్చిపోయింది? సుజాత ఆలోచిసుండగానే "పోస్టు" అంటూ పోస్టుమాన్ ఉత్తరం గిరాటెట్టి వెళ్ళాడు. సుజాత లేచి వెళ్ళి ఉత్తరం తీసుకుని చూసింది. కవరుపైన ఆ దస్తూరి చూస్తుండగానే గుండెలు దడ దడ లాడింది. ఇంత సరదాలో, ఈ గందరగోళంలో తనకి ఉత్తరం వ్రాయటానికి రాజాకి తీరికెక్కడ దొరికింది? ఉప్పొంగిన హృదయంతో, సంతోషంతో, వణుకుతున్న చేతుల్తో కవరు చించింది.

"సుజా!

నేను కావాలని హైదరాబాద్ మీదనుంచి బొంబాయి వెడుతున్నాను. రేపు సాయంత్రం ఏరోడ్రోమ్‌లో కొద్దిసేపు ప్లేన్ ఆగుతుంది. ఆ కొద్ది సేపటిలో నువ్వు కన్పించు సుజా! ఆ నాటి నీ మొహం నన్ను పిచ్చి వాడిని చేస్తోంది. ప్లీజ్, తప్పకుండా వస్తావుకదూ!

నీ రాజా.

పి.యస్. ఒకవేళ నువ్వు రాకపోయినట్టయితే నన్ను మన్నించ లేదనీ ఎప్పటికీ మన్నించవనే అనుకుంటాను."

సుజాత హృదయంమీద ఎవరో మంచుముద్ద పెట్టి నొక్కినట్ట యింది. తారీఖు చూసింది. ఐదారురోజులక్రింద అందవలసిన ఉత్తరం అది. పోస్టల్‌వాళ్ళ ధర్మమా అని ఇప్పుడు అందింది. ఇలా ఎంతమంది

రోజుకి అపార్థాలకి గురి అవుతున్నారు! తనకి ఉత్తరం అందలేదంటే రాజా నమ్ముతాడా? సుజాతకి నీరసం వచ్చేసింది.

ఆఖరిరోజు ఉభయదేశాలమధ్య స్కోర్స్‌లో పెద్ద వ్యత్యాసంలేదు. ఆస్ట్రేలియన్స్ ప్రాణాలకి తెగించినట్టు ఆడున్నారు. ఇండియన్ టీమ్ కూడా అలాగేవుంది. ఎవరు గెలుస్తారో చెప్పటం కష్టంగా వుంది. క్షణాలు దొర్లుతున్న కొద్దీ ఎదురుగుండా కూర్చుని చూస్తున్నవాళ్ళు పరోక్షంగా కూర్చుని వింటున్నవాళ్ళు వూపిరి బిగపట్టుకుని ఎదురు చూస్తున్నారు.

సుజాత నరాలన్నీ బిగపట్టుకుని రేడియోలో విన్పిస్తున్న కామెంటరీ వింటోంది. భగవాన్! ఈ ఆఖరిక్షణాల్లో రాజా....రాజా "ఓడిపోగూడదు. గెలవాలి, గెలిచితీరాలి! హిందూదేశానికి గర్వకారణం కావాలి."

వాసు, స్నేహితులు రెప్పవాల్చకుండా వూపిరి పీలుస్తే ఆగిపోతుందేమో నన్నంత భయంగా కూర్చుని వింటున్నారు.

ఉన్నట్టుండి పెద్దగోల, కేకలు అరుపులు! కామెంటరీ విన్పించటం మానేసింది.

"ఏమిట్రా ఏమైంది; వాళ్ళు గెలిచేశారా?" సుజాత తమ్ముడిని ఆదుర్దాగా అడిగింది.

"లేదు, లేదు, రాజా కాలు స్లిప్పయి పడ్డాడట!" వాసు రేడియోని కౌగిలించుకుని వింటున్నాడు.

క్రమేపీ రేడియో గోలతగ్గి కామెంటరీ విన్పించసాగింది. అంతవరకూ ఉత్సాహంగా అరుస్తూ చెప్తున్న అతని స్వరం విషాదంగా మారిపోయింది. "రాజా బౌండరీ దాటబోతున్న బాల్‌ని ఎగిరి పట్టుకుని అవతల కెప్టెన్‌ని అవుట్ చేశాడు. కాని కాలుజారి పడిపోయాడు· బలంగా దబ్బలు తగిలాయి. క్రిందపడకముందు బాల్ ప్రక్కనున్న అతనికి మెరుపులా చురుగ్గా అందివ్వకపోతే కెప్టెన్ అవుట్ అయేవాడు కాదు. అవతల టీమ్‌లో అసలైన మనిషి అవుట్ అయాడు. రాజాకి బలంగా దెబ్బలు తగిలినట్టున్నాయి. చుట్టూ అందరూ గుమిగూడారు. డాక్టర్ పరుగెత్తుకొచ్చాడు. ఆడిటోరియమ్‌లో వున్న జనాన్ని రాజా

దగ్గరికి వెళ్ళనివ్వకుండా ఆపటానికి పోలీసులు చాలా కష్టపడుతున్నారు" మళ్ళీ కామెంటరీ ఆగిపోయింది. పెద్ద గోల, కేకలు- అంతా గొడవగా వుంది.

కూర్చున్న చోటునుంచి హఠాత్తుగా లేచి నిలబడిన సుజాత మెల్లిగా మళ్ళీ కుర్చీలో వాలిపోయింది. ఏమిటది? ఆఖరి క్షణంలో ఎందు కిలా అయింది? దెబ్బలు తగిలాయా? భగవాన్!

"రాజాని బైటికి తీసుకెళ్ళిపోయారు. ఇక మిగిలింది మనకి కొద్ది టైమ్. మనవాళ్ళు జాగ్రత్తగా ఆడితే గెలిచే సూచనలున్నాయి." మళ్ళీ విన్పిస్తోంది కామెంటరీ.

రేడియో వదిలిపెట్టేసి వాసు హఠాత్తు లేచివచ్చి గుప్పిళ్ళు బిగించి అక్కగారి మీదపడి "నీ దిష్టే కొట్టింది. నీ ఏడుపే, నీ శనే-అందుకే అందుకే-పడిపోయాడు." అని కొట్టడం ప్రారంభించాడు.

"నేనేం చేశాన్రా?" ఈ లోకంలోకి వస్తూ అంది సుజాత.

"ఏం చేయలేదూ? ఓడిపోతారని వెధవ జ్యోతిష్యం చెప్పలేదూ?"

"అన్రా వాసూ, అను నా మనసులో బాధ నీకేం తెలుస్తుంది. కళ్ళ నీళ్ళతో అక్కడనుంచి వెళ్ళిపోయింది. గేమ్ డ్రా అయింది.

మర్నాడు పేపర్లనిండా పెద్ద పెద్ద అక్షరాలతో రాజాని గురించి పొగడలు. అతని ఫోటోలు, రాజా కాలుకి తగిలిన గాయం అదృష్ట వశాత్తూ అంతబలమైనది కాదు. కాని నాలుగు రోజులవరకూ బెడ్‌మీద నుంచి లేవలేదు, ఆపైన ప్లేనులో హైదరాబాదు వచ్చేస్తాడు. హాస్పిటల్లో కనీసం 10, 15 రోజులయినా వుండాలి.

సుజాత, రాజా హైదరాబాదు వచ్చే రోజుకోసం క్షణం ఒక యుగంలా లెక్కపెడుతోంది. చివరకి ఆ రోజు రానే వచ్చింది.

క్రికెట్ బోర్డు ఆఫీసుకి ఫోన్‌చేస్తే రాజా ఆరోగ్యం వర్వాలేదని, కొద్దిరోజులు విశ్రాంతి తీసుకుంటే నయం అవుతుందని, హాస్పిటల్లో చేర్చారని చెప్పారు.

o o o

సుజాత హాస్పిటల్ చేరుకునేసరికి "ఇప్పుడు చూడటానికి వీలులేదు. విజిటింగ్ అవర్సు సాయంత్రం" అన్నారు హాస్పిటల్ వాళ్ళు. నిరాశ

చెందిన సుజాత వెనక్కు తిరిగి ఇంటికి వెళ్ళటానికి ఇష్టపడలేదు. ఇంటికి వెళ్ళి మళ్ళీ సాయంత్రం రావాలంటే వీలుపడకపోవచ్చు. తండ్రి ఇలాగని ఏ మాత్రం పసిగట్టినా ఇంట్లోంచి అడుగుబైట పెట్టనివ్వడు. అందుకని ఈ నాలుగైదు గంటలు ఇక్కడే ఎక్కడయినా గడిపెయ్యాలనుకుంది. హాస్పిటలుకి కొద్ది దూరంలోనే ఒక స్నేహితురాలుండాలి. సుజాత ఆ ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళేసరికి వాళ్ళింట్లో లేరు. తలుపు తాళం వేసి వుంది. అక్కడనుంచి సరాసరి పబ్లిక్ గార్డెన్స్‌కి వచ్చేసి హెలు మ్యూజియం చూస్తూ, అక్కడా ఇక్కడా తిరుగుతూ ఎలాగో కాలం గడిపింది.

బస్సు దొరికి సుజాత మళ్ళీ హాస్పిటల్‌కి చేరుకునేసరికి రాజా గదిముందు హాల్లో పెద్ద క్యూ వుంది.

"అలా కూర్చోండి,వరుస ప్రకారం పిలుస్తాం" అంది ఓ లావుపాటి నర్స్. కొల్లేరు చాంతాడులావున్న ఆ క్యూని చూసేసరికి సుజాతకి నీరసం వచ్చేసింది. అవును. తనకీ శాస్తి జరగాల్సిందే! అసలు రాజాకీ తనకి మధ్య దూరాన్ని సృష్టించిదెవరు? ఇక్కడ అనేకరకాల వాళ్లు ఆత్రంగా కూర్చుని ఒక్కసారి అతన్ని చూసేచాలని ఎదుచూస్తున్నారు. తను ఆలోపలకివెడితే రాజా అసలు మొహం చూస్తాడా? ఒకవేళ ఎవరో అనుకొని పొరపాటున చూచిన వెంటనే మోహం తిప్పేసుకుంటే! తనేం చేయాలి? ఊరికినే కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి, అందులో రాజా నిర్లక్ష్యంగా చూస్తే-కఠినంగా మాట్లాడుంటే భరించటానికి ఎంత శక్తి కావాలి! పోనీలే-అతనెంత అసహ్యంగానయినా మాట్లాడనీ! ఒక్కసారి చూసి "ప్రపంచంలో నాకంటే నీ క్షేమం ఎక్కువ కోరేవాళ్ళు ఎవరూ లే"రని చెప్పి వచ్చేస్తుంది-

పరధ్యానంగా ఆలోచిస్తున్న సుజాతకి లోపలినుంచి ఖరీదైన నైలాన్ బట్టలో తెల్లగా మల్లెపువ్వులా నాజుకుగా వున్న అమ్మాయి బైటికి రావటం కన్పించిది. అందరి కళ్ళూ తనమీదనే వున్నాయని గ్రహించిన ఆ అమ్మాయి మరింత వయ్యారం ఒలకబోసు నడిచి వెళ్ళిపోయింది.

"ఎవరా అమ్మాయి?" ఎవరో కుతుహలంగా అడిగారు.

"ఆ అమ్మాయి తెలియదూ? అతని కాబోయే భార్య, మన బలరామ్ జాగీర్దార్‌గారి ఏకైక పుత్రిక."

"ఓహో! అలాగా! నాకు తెలియదు."

"ఈ మధ్యనే పరిచయం అయింది ఇద్దరికి. దగ్గరలోనే పెళ్ళి అవబోతోందని విన్నాను."

కొరడాతో ఛళ్ళున చరిచినట్లు ఉలిక్కిపడింది. ఆ అమ్మాయిని సరిగ్గా చూద్దాం అనుకునేలోపలే వెళ్ళిపోయింది. రాజాకి ఈ అమ్మాయికి పరిచయం అయిందెప్పుడు? అంటే-అంటే రెండు సంవత్సరాలనుంచి ప్రాణానికి ప్రాణంగా మసలిన సుజాత ఈ ఒక్క చిన్న సంఘటనతో దూరమై పోయినట్టేనా!

ఈర్ష్యతో,అవమానంతో సుజాత హృదయం ఇనపగుళ్ళు బిగించినట్టు క్రింద కెక్కడికో క్రుంగిపోసాగింది. పోన్లే ఒక్కసారి, ఆఖరిసారి చూసి వెళ్ళిపోతుంది.

ఇంకో ఆరుగురు అయిపోతే తనకి ఛాన్సు వస్తుంది గదా అని ఆశతో ఓపిగ్గా క్షణాలు లెక్కపెట్టుకుంటూ ఎదురు చూస్తుండగా, ఓసారి లోపలికి వెళ్ళిన నర్సు బైటికివచ్చి "ఇక అతనెవర్నీ చూడనంటున్నాడు. టైమయిపోయింది, వెళ్ళండి" అంది.

సుజాతకి మూర్ఛవచ్చినంత పనైంది.మిగిలిన వాళ్ళంతా మెల్లిగా లేచి వెళ్ళిపోసాగారు. లేచి నిలబడిన సుజాత నర్సు దగ్గరికి వచ్చి "నర్స్, ఒక్క పది నిమిషాలు-ప్లీజ్!" అంది.

"వీల్లేదు. అతనిప్పటికే చాలా నీరసపడి పోయాడు." ఖచ్చితంగా తెలిసినట్టు చెప్పింది.

"ప్లోసీ, ఒక్క అయిదు నిమిషాలు. ఉదయం నుంచి నే నిక్కడే వున్నాను."

"ఎవరుండమన్నారు నిన్ను? వీల్లేదని చెప్పటంలా? అంత చూడాలని వుంటే రేపు అందరికంటే ముందొచ్చి కూర్చో" అనేసి నర్స్ మరో మాటకి అవకాశం ఇవ్వకుండా వెళ్ళిపోయింది.

ఏం చేయాలో తోచలేదు. ఉసూరుమంటూ వెళ్ళిపోవటానికే నిశ్చయించుకుని ముందుకు అడుగులు వేసింది. ఇంతసేపు అవస్థపడి చూడకుండా వెళ్ళటమా? ఉహూ. చూడందే ఇంటికి వెళ్ళదు. వెళ్ళినా నిద్ర పట్టదు. హఠాత్తుగా గట్టిగా నిశ్చయించుకున్న సుజాత గిరుక్కున

వెనక్కి తిరిగింది. హాల్లో ఎవరూ లేరు. గబగబా లోపలికి వెళ్ళింది. లోపల కారిడర్‌లో మళ్ళీ ఆగిపోయింది. రెండువైపులా వరసగా కన్పిస్తున్న ఈ గదుల్లో రాజా గది ఏది?

ఇంతలో చేత్తో థర్మామీటర్‌తో అటే వస్తున్న ఇంకో నర్స్ నవ్వుతూ "ఎవరు కావాలి?" అంది.

"అదే. అతను-దెబ్బలు తగల్లేదూ?"

"క్రికెట్ ప్లేయరేనా?"

అవునన్నట్టు చప్పున తలూపింది.

"నే నప్పుడే అనుకున్నాను. అదుగో ఆ చివరిగది వెళ్ళండి. మీ కాలేజీ విద్యార్థినులంతా అతనికోసం కలవరించి పోతున్నట్టున్నారే. అదృష్టవంతుడు మొత్తానికి-" అని నవ్వుతూ వెళ్ళిపోయింది.

ఒక్కసారి గట్టిగా వూపిరి పీల్చుకున్న సుజాత నర్సు చూపించిన గదివైపు నడిచింది. నడుస్తున్నంత సేపు ఏ మూలనుంచి ఆ లావాటి నర్స్ వచ్చి పడుతుందోనని భయం గుండెల్లో పీకుతూనే వుంది.

తడబడుతున్న అడుగులతో గుమ్మంలోకి వచ్చి ఆగిపోయింది. గదిలో మంచంమీద ఎత్తుగా పెట్టిన దిండ్లని ఆనుకుని, కళ్ళు మూసుకుని వెనక్కు చేరగిలబడి కూర్చున్నాడు రాజా. అతన్ని చూడగానే గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. కళ్ళుమూసుకునివున్న అతను ఏదో ఆలోచిస్తు నట్లు వున్నాడు. నుదుటిమీద శిలువ ఆకారంలో ప్లాస్టర్ వుంది. ఎడమ చేతికి మోచేతిదగ్గర బాండేజి వుంది. రక్తంలేనట్టు, మొహం తెల్లగా పాలి పోయింది. ఎప్పుడూ నున్నగా నిగనిగలాడే గడ్డం మానిపోయి గరుకు తేలినట్టు, దూరానికి కూడా స్పష్టంగా తెలుస్తోంది. ఆ పరిస్థితుల్లో అలా మంచంమీద నిస్సహాయంగా కూర్చుండిపోయిన రాజాని చూసేసరికి సుజాత మనసు వేదనతో విలవిలలాడి పోయింది.

దీర్ఘాలోచనలో మునిగిపోయినట్టున్న అతను ఒకసారి నిట్టూర్చి "నర్స్—" అంటూ ఏదో చెప్పటానికి కళ్ళు తెరిచినవాడల్లా గుమ్మంలో కనబడిన సుజాతవైపు తెల్లబోయి చూస్తుండిపోయాడు. సుజాత నోట్లోంచి మాట పెగలేదు. అడుగు ముందుకు పడలేదు. స్థాణువులా నిలబడి పోయింది.

"సుజా!" అస్పష్టంగా తనలో తను అనుకుంటున్నట్టు అన్నాడు. అతను చూస్తున్నది కలా నిజమా అనుకుంటున్నట్టున్నాడు.

"సుజా!" లేవబోయి కాలు గుర్తురావటంతో ఆగి సందేహంగా చేయి జాచాడు. అంతే! ఇంతవరకూ తటపటాయిస్తూ, భావాల్ని లోంగ తీసుకోవటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్న సుజాత ఒక్కపరుగులో వచ్చి అతని ప్రక్కన ప్రాలిపోయి అతనిచేతిని రెండుచేతుల్లోకి తీసుకుని వెంటనే అందులో మొహం దాచేసుకుంది.

"సుజా! నిజంగా నువ్వేనా?" నీరసంగా అడిగాడు.

"నేనే- నేనే!" హఠాత్తుగా దుఃఖం ముంచుకొచ్చేసింది.

"నన్ను క్షమించండి!" అంది.

"ఎందుకు - ఎందుకెందుకు-నేనే-" అతని కంఠం గూడా జీర బోయింది. "లే! లేచి సరిగా కూర్చో" అన్నాడు.

సుజాత లేవాలని ప్రయత్నం చేసినా లేవలేకపోయింది.

"లే సుజాతా! నువ్విలా ఒరిగిపోతే రెండు చేతుల్తోనూ లేపదీసి దగ్గరికి లాక్కోవాలనిపిస్తోంది నాకు. అసలే నా మనసు నా వశంలో లేదు."

సుజాత మాట్లాడలేదు. అతను చెప్పటం దేనికి-ఆ పని ఎందుకు చెయ్యడు?

"లే? ఎవ్వరైనా చూస్తే బాగుండదు కూడా."

సుజాత చురుగ్గా తలెత్తి నీళ్ళు నిండిన కళ్ళతో "ఏం? ఎందుకు బాగుండదు? ఇప్పుడు మీ పరువు ప్రతిష్టలు అడ్డొస్తాయిగదూ? మీ అభిమానులు, ఆప్తులు చూస్తే అపార్థం చేసుకుంటారని భయంకదూ? అంతే! మీరేం భయపడకండి. నేనేం పూర్వపు సుజాతలా మీమీద అధికారాన్ని చూపించుకోవటానికి రాలేదు" అంది.

క్షణంసేపు సుజాత కళ్ళలోకి లోతుగా చూశాడు రాజా. క్రమేపీ అతని మొహం కఠినంగా మారిపోతుండగా "ఆ సంగతి నాకు తెలుసు. నువ్వు చెప్పక్కర్లేదు" అన్నాడు.

"నాకూ తెలుసు. ఇప్పుడెక్కడచూసినా మీ పేరే, ఎవరినోటంబడి విన్నా మిమ్మల్ని గురించే. ఇప్పుడు మీకున్న ఆప్తుల్లో సుజాత

ఏమూల?" సుజాతకి కూడా రోషం వచ్చేసింది. "పాపం, రాజా అంటే వూరూ పేరు లేనప్పుడు వాళ్ళంతా ఎక్కడున్నారో! అప్పుడు వ్యక్తిత్వం గుర్తించటానికి సుజాత తప్ప ఎవ్వరూ లేకపోయారు. ఇప్పుడెక్కడ- హైద్రాబాద్‌లో వున్న ఆడపిల్లలంతా...."

"నీ మొహం!" మొహం తిప్పేసుకుంటూ అన్నాడు.

"అవును. మరి నా మొహమే! జాగీర్దారుగారమ్మాయితో స్నేహం కలిగినప్పుడు-"

వెంటనే ఇటు తిరిగిన రాజా సుజాత రెక్కపట్టుకుని విసురుగా దగ్గరికి లాక్కుంటూ "మొదలిది చెప్పు- మీ బావతో నీ పెళ్ళి స్థిరపడ లేదూ?" అన్నాడు కోపంగా.

సుజాత మౌనంగా కళ్ళలోకి చూస్తూండిపోయింది.

"చెప్పు, సమాధానం చెప్పవేం?"

సమాధానం రాలేదు.

సుజాత రెక్క వదిలేస్తూ "నాకు తెలుసు. నువ్వేం జవాబు చెప్ప గలవు? వెళ్ళు. ఎందుకొచ్చావు? దెబ్బలు తగిలాయని చూసి నా మొహం మీద నవ్వి పోవటానికా? అన్నాడు."

సుజాత మాట్లాడకుండా అతని చేతిని జారిపోన్వకుండా గట్టిగా పట్టుకుని మళ్ళీ అందులో మొహం దాచేసుకుంది.

"వదులు. నువ్వంత తేలికగా జరిగినదంతా మర్చిపోయి మన సెలా మార్చుకోగలిగావో నా కర్థంగావటం లేదు. నా కిప్పుడు తెలు స్తోంది. నేను నిన్ను అర్థం చేసుకున్నాననుకోవటం-నువ్వందరిలా కావను కోవటం శుద్ధ తెలివి తక్కువ. ఏవేవో వూహలు నాలో రేకెత్తించి వాస్తవంలో ఓడించావు. నాకు తెలుసులే. ఆ రోజు అలా హఠాత్తుగా నిగ్రహం పోగొట్టుకుని పశువులా ప్రవర్తించానని నా మీద కసి తీర్చు కుంటున్నావు-అంతేనా? ఆరోజు నువ్వలా హఠాత్తుగా వెళ్ళిపోయినప్పటి నుంచి నాకా క్షణం గుర్తొస్తేనేచాలు. మనసు వేయి రంపాలతో కోసినట్టు అనిపిస్తోంది. అక్కడికీ ఎన్నిసార్లు సిగ్గువిడిచి నువ్వెంత విదిలించే స్తున్నా ఒక్కసారి అవకాశం యివ్వమని అడిగాను. మనసారా క్షమా

ర్పణ కోరుకోవాలని ఎంతగానో ఆశించాను. ఎంత చంపినా ఆశ చావ లేదు. ఏరోడ్రోమ్‌కి తప్పకుండా వస్తావని చివరిక్షణం వరకూ యెదురు చూశాను. నువ్వు రానేలేదు-అప్పుడు అర్థమైంది. నువ్వు నన్ను క్షమించ లేదనీ శిక్ష విధించటానికే నిశ్చయించుకున్నావనీ-"

"లేదు, లేదు-నన్ను క్షమించండి.నాకా ఉత్తరం చాలా ఆలస్యంగా అందింది."

రాజా సుజాత మాటలు వినిపించుకునే ధోరణిలో లేడు.

"అప్పుడు గూడా అంతే-పబ్లిక్ గార్డెన్స్‌లో నా ప్రక్కన శ్యామలని చూసి—"

"నా కవన్నీ చెప్పొద్దు. మీరేం సంజాయిషీ ఇవ్వనవసరం లేదు."

"ఎందుకు?ఎలాగూ మాధవుని చేసుకుంటున్నావుగాబట్టి అనవసరం అంటావా?-"

"మీరు పొరబడుతున్నారు నన్నర్థం చేసుకోవటం లేదు."

"నువ్వు నన్ను బాగా అర్థంచేసుకున్నావుగా-చాల్లే."

రాజా చేయి విదిలించుకున్నాడు.

"నన్నేమీ అనకండి, నేను వచ్చాను- అంతే."

"వచ్చావులే! పాపం దెబ్బలు తగిలాయని సానుభూతి చూపించ టానికి-థ్యాంక్స్!

"నీ సానుభూతి నాకేమి అక్కరలేదు వెళ్ళు.ఓ అరగంట ఆలస్యం అయితే మళ్ళీ మీ బావ ఏమైపోయావోనని ఖంగారుపడి వెతుక్కోవచ్చు."

అంత దుఃఖంలోను సుజాతకి అతని ఈర్ష్య చూస్తుంటే నవ్వొచ్చింది.

"నా ఇష్టం వచ్చినచోట ఇష్టంవచ్చినంత సేపు నేనుంటాను, కాదన టానికి అతనెవరు మధ్య?"

"కాబోయే భర్తకి ఆ మాత్రం అధికారం లేదనటానికి నువ్వెవరు మధ్య?"

"అదేం లేదు. నాన్నగారు నన్నతనికి యివ్వాలనుకుంటున్న మాట నిజమే. కాని-కాని, నా కిష్టంలేదు.నాఇష్టాన్ని వాళ్ళు కాదంటే కట్టుబట్టల్తో మీ దగ్గరికి వచ్చేస్తాను. మీరు, మీ రెప్పుడు కాదనకండి."

"అయ్యో పాపం! ఒక్కగానొక్క కూతురువి. అలాచేస్తే మీనాన్న పరువుప్రతిష్ఠ లేమైపోతాయి?" వ్యంగ్యంగా అన్నాడు.

"మీరేం హేళన చేసినా సరే! అవేవీ నాకు ఆనందాన్ని కల్గించలేవు. వాటికోసం మిమ్మల్ని పోగొట్టుకోలేను. నాకిన్ని రోజుల నుంచి మనశ్శాంతిలేదు. నేను ఓడిపోయాను!నన్ను వెక్కిరించకండి. నాక్కావల్సింది మీరు."

"ఎలా మార్చుకోగలిగావు మనసుని? ఆలోచన ఆచరణలో పెట్టే ధైర్యం లేదుగా."

"ఓడిపోయానని చెప్పటంలా!"

"అంతేనా? లేక ఇప్పుడు నాకు మీనాన్నకి మించిన పరువు ప్రతిష్ఠలు లభించినాయనా?"

సుజాత వెంటనే తలెత్తి చూసింది. దెబ్బతిన్నప్పుడు గిలగిలలాడే పక్షిలా కళ్ళు రెపరెపలాడినాయి. నెమ్మదిగా రాజా చేతిని వదిలేస్తూ-

"నిజం నేనామాట మర్చిపోయాను. మీ పరువు ప్రతిష్ఠలు మీరుంచుకోండి. నా పూర్వపు రాజాని నా గుండెల్లో భద్రంగా దాచుకుంటాను" అంటూ లేచి నిలబడింది.

"సుజా!"

"నిజమే. మిమ్మల్ని చూడాలనుకుని వచ్చాను. చూశాను. వెడానింకా. కాని ఈ ప్రపంచంలో నా కంటే యెవరూ యెక్కువగా మీ క్షేమం కోరరు."

రాజా నిశ్శబ్దంగా ఎర్రబడిన సుజాత మొహంలోకి చూస్తుండి పోయాడు.

ఇంతలో గదిలోకి ఎవరో వచ్చారు.

"హల్లో శ్యామూ! రా—రా." ఆనందంగా పిలిచాడు రాజా.

సుజాత గిరుక్కున వెనక్కు తిరిగి చూచింది. వెంటనే తెల్లబోయింది. శ్యామలతో పాటు మాధవరావు కూడా లోపలికి వచ్చాడు.

"బావా!" సుజాత ఆశ్చర్యపోయింది.

"బాసంఖీ! నువ్వూ.... ఇక్కడ" మాధవ మాటల కోసం తడుముకుంటున్నాడు.

"రాజా! ఇతనే మాధవరావు. నేను చెప్పలా?"శ్యామల పరిచయం చేసింది.

"ఏమిటీ!" రాజా ఆశ్చర్యంగా, కుతూహలంగా చూస్తుండి పోయాడు. మాధవ ఈ పరిచయాల గొడవ పట్టించుకోకుండా సుజాత దగ్గరకెళ్ళి రెండుచేతులూ పుచ్చుకుని, "బాసందీ! పొరపాటయిపోయింది. క్షమించాలి. నేనసలు హైదరాబాద్ వచ్చింది శ్యామలకోసం. హఠాత్తుగా మామయ్య మనిద్దరి పెళ్ళి అనటం చూసి నాకు కంగారుతో మతి పోయింది. ఎన్నిసార్లో నీకు ప్రయత్నంచేసి కూడా చెప్పలేకపోయాను" అని, శ్యామలతో "శ్యామా! నా మరదలు సుజాత" అన్నాడు.

శ్యామల నవ్వుతూ ముందుకొచ్చి "తెలుసు, ఆ రోజు పబ్లిక్ గార్డెన్‌లో చూశాను" అంది.

"ఏ రోజు?" అన్నాడు మాధవ.

"అదే! అరోజు రాజాతో నీ గురించి చెప్పానని చెప్పలా?"

అనుకోకుండా రాజా కళ్ళు సుజాతతో కలిసినాయి. మళ్ళీ వెంటనే ఇద్దరూ చూపులు తిప్పేసుకున్నారు.

మాధవ మళ్ళీ సుజాతచేతులు అందుకుంటూ "మామయ్యతో యెలా చెప్తావో అంతా నీదే భారం సుమా! మళ్ళీ అమ్మదాకా వెళ్తే యేమయి పోతుందోనని నిన్ననే రిజిష్టర్ మారేజ్ చేసుకున్నాం బాసందీ!" అన్నాడు దీనంగా.

శ్యామల మాధవ్ చేతులు లాగేస్తూ "అంత కంగారు దేనికి? అదేదో వాళ్ళిద్దరూ చూసుకుంటారు" అంది.

"ఏ ఇద్దరు?" మాధవ్ ఆశ్చర్యపోయాడు.

"కన్పించటంలా!" అంటూ రాజాని వేలుపెట్టి చూపిస్తూ "మీ మరదలు యిప్పుడిక్కడ యెందుకుంది అనుకుంటున్నావు?" అని క్రీగంట సుజాతని చూస్తూ "బహుశా మీ మామయ్యకి యిదిగూడా తెలిసి వుండదు" అంది.

సుజాత పెదవులమీద తిరిగి నవ్వు తొంగిచూసింది.

"వాట్! నిజంగా" క్షణంసేపు తీవ్రంగా ఆశ్చర్యపోయిన మాధవ్ వెంటనే రాజా చేతిని అందుకుంటూ "నిజంగా?" అన్నాడు.

"సందేహం లేదు. మీ మరదలు, నేను రెండు సంవత్సరాలనుంచి ప్రాణస్నేహితులం" నవ్వాడు రాజా.

మాధవ్ వెంటనే ప్రక్కనున్న కుర్చీలోకూలబడ్తూ "హరిదేముడా! శ్యామా, నాకీ సంగతి మాట మాత్రం తెలిసినా తిండి బాధ గురించి తప్పేదికదా!" అన్నాడు.

"అంటే ఏమిటి?"

"ఏం తిండని చెప్పను! అన్నిరకాలు చివరికి డోకువచ్చే చలిమిడి గూడా అబ్బ! అది గుర్తుకొస్తే ఇప్పుడుకూడా వాంతి వస్తుంది." మాధవ్ మొహం వికృతంగా పెట్టాడు. శ్రోతలు ముగ్గురు నోరు తెరుచుకుని వింటున్నారు.

"నా అవస్థయేమని చెప్పను! సుజాతకి నా మీద అసహ్యం పుట్టించాలని తిండిపోతులా ప్రవర్తించాను. ఏవేళప్పుడు యే బట్ట తీసుకోవాలో తెలియని చవటలా మొహం పెట్టాను. వట్టి భయస్థుడిలా నటించాను. తిండి విషయంలో తప్ప యింకోటి మాట్లాడటం రాని మూర్ఖుడిలా మెసిలాను అబ్బ! రెండు రోజులనుంచి ఒకటే కపుడునొప్పి" బాధగా పొట్ట రాచుకున్నాడు. అందరిలోకి ముందుగా సుజాత ఫక్కుమని నవ్వేసింది. శ్యామల సీరియస్‌గా చిరునవ్వు చిందించింది. రాజా కళ్ళముందున్న సందేహపు తెరలు తెగి కిందపడ్డాయి. అతని కళ్ళకి సుజాత యెప్పటిలా ప్రపంచంలో అన్నిటికంటే ప్రియాతి ప్రియంగా కన్పించసాగింది.

కొద్ది సేపయింతర్వాత ఆ మాట ఈమాట చెప్పి వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. సుజాత మొహంలో ప్రసన్నత వాళ్ళతోబాటే వెళ్ళిపోయింది. పరధ్యానంగా నిలబడి శూన్యంలోకి చూస్తూ ఆలోచిస్తుండిపోయింది.

"సుజా!" రాజా కంఠం వింటూనే మనసులో ఉలిక్కిపడింది. ఆ పిలుపులో ఆప్యాయతకి మించిన ఆదుర్దా, ఆదుర్దాకి మించిన ఆప్యాయత పోటీ పడ్తున్నాయి. వెంటనే యీ లోకంలోకి వస్తూ "వెడ్తాను" అంది.

"సుజా!" రాజా చప్పున ఖంగారుగా పయిట కొంగును గట్టిగా పట్టుకున్నాడు.

"వెళ్ళేముందుఒకటి అడుగుతాను చెప్పండి. ఆరోజు నేనలా నోరు పారేసుకున్నానని మీ రిలా" వాక్యం పూర్తి చేయలేకపోయింది.

"లేదు సుజా లేదు. అయినా నేను వోడిపోతావనిగదూ నువ్వంది? గెల్చానుగా! అప్పుడనుకున్నాను. నువ్వు మనసారా ఆ మాట అనలేదని. అక్కడ ఆ సమయంలో నువ్వు లేని లోటు నాకెంతో అన్పించింది. ఉంటే పై కెత్తి గిరగిర తిప్పి చూశావా, నీ కన్నీళ్ళు శాపం కాలేదు. అంటే మనసులో నువ్వు నాక్షేమం కోరుతున్నట్టే అని చెప్పాలనిపించింది."

సుజాత కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఒక్కసారి వెళ్ళి అతని చేతులలో వాలిపోయి నిజం నిజం అని చెప్పాలనుకుంది. బలవంతాన శరీరంలో వున్న శక్తినంతా కూడదీసుకుని నిగ్రహించుకుంది.

"నువ్వు గూడా నాకిది చెప్పు, ఆ రోజు నేనలా పశువులా ప్రవర్తించానని నీకు బాధగా లేదూ" అన్నాడు రాజా.

సుజాత లేదన్నట్టు తలూపుతూ "నా మాట కాదని నిర్లక్ష్యంగా వెళ్ళిపోయారన్న కోపం తప్పితే నాకేం లేదు. చిన్నపిల్లలు చెప్పిన మాట వినకపోతే తల్లి ఒకటి చరుస్తుంది. అంతమాత్రాన తల్లికి ఆపేక్ష లేదని అనగలమా!"

"సుజా!" చటుక్కున రాజా ముందుకు వంగి సుజాత చేతిని పట్టుకుని బలంగా తనవైపు గుంజుకున్నాడు. యధాలాపంగా నిలబడిన ఆమె అనుకోకుండా అతను చేసిన యీ పనితో తూలివచ్చి మంచంమీద పడింది. వెంటనే భుజాల చుట్టూ చేయివేసి దగ్గరకు లాక్కున్నాడు ఇద్దరి కళ్ళు కలుసుకున్నాయి. రాజా కళ్ళు కాంతివంతమయినాయి.

"ఇంత అర్థం చేసుకునే అమ్మాయేనా అంత పెంకెగా మాట్లాడి నన్ను రెచ్చగొట్టేది?"

"అంత ప్రేమించి ప్రాణంగా చూసుకున్న మీరేనా ఇలా పరుషంగా మాటలు విసిరేది?".

రాజా వెంటనే సుజాత తలని గుండెలకి హత్తుకుంటూ "మాటలు కాక మిగిలిందేమిటో చెప్పుమరి! ఆ రోజు అంతా అయిందని నా మీద కసితో నువ్వు మాధవ్‌నిచేసుకోటానికి వప్పేసుకుంటున్నావేమోనని నాకు భయం ఈర్ష్యతో మతిపోయినట్టయింది. నీ మాట కాదన్నందుకు నేనెంత మధన పడ్డానో నీకెలా తెలుస్తుంది? అవును సుజా!ఒక్కటి ఆలోచించు. నీమాట కాదనే సాహసం లేక నేను మానేశాను అనుకో!నా బదులు ఇంకో

అతను సెలక్టు అయేవాడు. పేపరులో వార్తలు చూసినప్పుడల్లా, రేడియోలో కామెంటరీ విన్నప్పుడల్లా దీనికంతటికీ కారణం నువ్వేననిపించేది. అసహ్యం వేసేది. నువ్వప్పుడు నా ఆలోచనలని, ఆశయాలని పంచుకునే ఆత్మీయురాలివిగా గాకుండా, నా కలల్ని నాశనం చేసే రాక్షసిలా, నా కాళ్ళకి పెనవేసుకున్న బంధంలా కన్పించేదానివి.నువ్వంటేవిసుగుపుట్టేది. ఇప్పుడు వెళ్ళానన్నమాటేగాని మనసంతానీ దగ్గర వుంది." రాజా జేబులు తడుముకుని జేబురుమాలు పైకి తీసి చూపిస్తూ" ఇదుగో చూడు. ఆ రోజు పారేసుకుని వెళ్ళావు. దీన్ని ఎంత భద్రంగా దాచుకున్నానో! ఒక్క నిమిషం కూడా దీన్ని వదలలేదు. ఇప్పుడు చెప్పు నేను చేసింది మనిద్దరికీ మంచిదేనా, కాదా!" అన్నాడు.

"మీరింత వివరంగా చెపితే నేనేందుకు కాదంటాను!" అతని షర్టుని గుండెల దగ్గరికి పట్టుకుంటూ అంది.

"తమరింత సావకాశంగా వినే అవకాశం యివ్వాలిగదా!" అంటూ సుజాత జుట్టు సరిచేస్తూ "సుజా! ఈ ప్రపంచంలో మొగాడు పొందబోయే అన్నింటిలోకి స్త్రీ హృదయం అత్యుత్తమమైందని, సాటిలేనిదని మాకు తెలుసు? కాని ఆ గుర్తింపుని మీ ఆడవాళ్ళు బలహీనత క్రింద తీసుకుని దానితో మా కాళ్ళని బంధించాలని చూడకూడదు. మా ప్రపంచంలోకి మమ్మల్ని స్వేచ్ఛగా వెళ్ళిపోనివ్వాలి" అన్నాడు.

సుజాత చప్పున అతని గుండెల్లో మొహం దాచేసుకుంది. చాలా సేపటినుంచి నిగ్రహించుకుంటున్న కన్నీరు కాల్వలు కట్టసాగింది. రాజా నిశ్శబ్దంగా పొడిపొడిగా వదులుగా ఉన్న సుజాత జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి నిమురుతూ వుండిపోయాడు. కొద్దిసేపయింతర్వాత "ఇందాక నువ్వన్న మాటలన్నీ మనస్పూర్తిగా అన్నవేనా సుజా!" అన్నాడు జీర బోయిన కంఠంతో. అతనికి అసలు సుజాత స్పర్శతోనే తన శక్తి అంతా యిమిడి ఉన్నట్టనిపిస్తోంది.

"ఏ మాటలు?"

"నా కోసం మీ నాన్నవాళ్ళని కాదని కట్టుబట్టల్తోవచ్చేయటం...."

"ఉహుఁ! కాదు అబద్ధం!" రోషంగా అంది.

రాజా నవ్వేశాడు. "పోన్లే! నాకు అబద్ధాలే నిజాలుగా కన్పిస్తు

న్నాయి. కాని నువ్వు నిజంగానే నా కోసం అలా వచ్చేస్తే ఆ క్షణం నుంచి నీ సుఖం ముఖ్యం. నువ్వు కాదన్న పని యేదీ చెయ్యను. చివరికి నువ్వు వద్దంటే క్రికెట్ గూడా మానేస్తాను."

సుజాత వెంటనే చేయిచాచి అతని నోరు మూసేస్తూ "లేదు లేదు. యెప్పటికీ అలా అనను. మనకి డబ్బులేదనే బాధకూడా వద్దు. నేనే ఉద్యోగం చేస్తాను" అంది.

"నా పిచ్చి సుజా! కట్టుకున్న భార్యకి అన్నం పెట్టలేని అసమర్థుడిని చేసుకుంటావా నువ్వు? లోకంచేత ఆ మాట నిన్ను పడనిస్తానా నేను! అవిగో ఆ బల్లమీద ఆ కాగితాలు చూడు, అవన్నీ ఉద్యోగాలకి అప్లికేషన్లు. ఒకటి రైల్వేబోర్డు వాళ్ళది. ఇంకోటి రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాది. మరోటి పోలీసు డిపార్టుమెంటునుంచి. నేనేం పనిచేయ నవసరంలేదట. వాళ్ళ ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాను అంటే చాలుట. అన్నీ సౌకర్యాలు యిస్తామంటున్నారు. మనిద్దరికీ యేది నచ్చితే నేను దానికి ఒప్పుకుంటాను. సరేనా?"

సుజాత నిశ్శబ్దంగా అతని హృదయానికి అంటుకుపోయింది.

ఇంత వివరంగా, ఇంత విశాలంగా ఆలోచించే రాజానేనా తను దూరం చేసుకోబోయింది. భగవాన్!

"హార్లిక్స్ ప్లీజ్"నర్సు దగ్గుతూ అనటంతోఇద్దరూ ఉలిక్కిపడ్డారు. రాజా చప్పున సుజాతని వదిలేశాడు. సుజాత కంగారుపడి దూరంగా జరిగి కూర్చుంది,

"నా కాబోయే భార్య" హార్లిక్స్ అందుకుంటూ సంజాయిషీ యిచ్చుకున్నాడు.

"ఈ అమ్మాయా?" నర్స్ విచిత్రంగా చూసింది.

"అవును-ఏం?"

"ఈ అమ్మాయి ఉదయం వచ్చి తిరిగి వెళ్ళిపోయింది. సాయంత్రం అందరికంటే ఆలస్యంగా వస్తే టైమైపోయింది. వెళ్ళిపొమ్మన్నాను" నమ్మలేనట్టు సుజాతని చూస్తూ అంది.

"ఏమిటి? నిజంగా" తెల్లబోతూ అడిగాడు రాజా.

సుజాత జరిగినదంతా క్లుప్తంగా చెప్పింది.

"ఏం వనదీ? పిచ్చిదానిలా ఎండలో అక్కడక్కడా తిరుగుతున్నావా? చిన్న చీటీమీద పేరు వ్రాసి పంపకూడదూ? నేనేమో ఇక్కడ నీ కోసం ఇప్పుడొస్తావు, అప్పుడొస్తావు అని ఒళ్ళంతా కళ్ళు చేసుకొని ఎదురు చూస్తుంటే? అందుకే మొహం అలా వాడిపోయింది. ఇంద ఈ హార్లిక్స్ తాగు."

"వద్దు వద్దు." సుజాత వారించ బోయింది.

"తాగమంటే నిన్నుకాదూ! వూ(!" అక్కడున్న నర్సుని లక్షపెట్టకుండా సుజాత నోటికి హార్లిక్స్ అందించాడు.

"మిష్టర్ రాజశేఖర్! మీ చేతికి బాండేజ్ వుందన్న సంగతి మర్చిపోతున్నారు మీరు." ధుమ ధుమలాడుతున్న మొహంతో అనేసి వెళ్ళిపోయింది. క్షణంసేపు నర్సు మొహంలో కన్పించిన ఈర్ష్యకి సుజాత గుండెలు గర్వంతో ఉప్పొంగినాయి.

"నిజం. మీ కట్టు" అంది అతని చేతిమీద తనచేయి ఆనిస్తూ.

"ముందు నువ్వు మాట్లాడకుండా తాగు." నసిగాడు రాజా. ఇంత పిచ్చి పిల్లలా తనకోసం ఈ చుట్టు ప్రక్కల ఉదయం నుంచి వాడిపోయిన మొహంతో తిరుగుతోందని తనకేం తెలుసు! ఇక్కడేమో ఎంత సేపటికి ఎవరెవరో వస్తారుగాని తనకి కావల్సిన వ్యక్తిరాదయ్యె. నయం! సమయానికి శ్యామలా, మాధవ రాకపోతే ఈ అపార్థాల నీడలు మరింత చిక్కపడేవేమో! ఈర్ష్యతో, గుడ్డిదైన తన మనసు విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతే అభిమానంతో, రోషంతో సుజాత మరింత తల తిక్కగా మాట్లాడితే వెళ్ళిపోయేది.

"సుజా! ఇంకెప్పుడయినా ఇలాటి పరిస్థితులొస్తే ఎప్పటికైనా నేనే ఓడిపోయినీ దగ్గరకు వచ్చేలా చేసుకో. అంతేగానీ...."

"వద్దు—వద్దు. ఇంకెప్పుడూ వద్దు ఒక్క నిమిషం గూడా నేను భరించలేదు. అందులో మీరు ఓడిపోయారనటం అసలే భరించలేను" గ్లాసు తోసేసి ఆవేశంగా అతని గుండెల్లో తలదాచుకుంటూ అంది.

"ఎందుకని? భార్యభర్తలైనాక అపార్థాలు రాకుండా వుంటాయా? తప్పు తెలుసుకుంటే ఓటమిని ఒప్పుకోవటంలో తప్పేముంది?" ఆశ్చర్యంగా అన్నాడు.

సుజాత అడ్డంగా తల తిప్పుతూ "మీరు ఓడిపోయారు అనటం నేను సహించలేను. చివరికి నాదగ్గరైనా సరే." అంది.

"ఎందుకని? క్షణం క్రితం నిశ్చింతగా, నిగర్వంగా నువ్వు 'ఓడిపోయాను' అనేశావు!"

"నా మాట వేరు."

"లేదు సుజా, లేదు-హృదయాలు కలిసిపోయి ఆత్మలే ఏకమైపోయినచోట గెలుపు, ఓటమి ప్రసక్తే లేదు. నేను గెలిస్తే నువ్వు గెలిచినట్టే-నువ్వు ఓడిపోతే నేను ఓడిపోయినట్టే. అది మాటల్లో మనం చెప్పుకోనవసరంలేదు." అతని కనుకొలుకుల్లో నీళ్ళు నిలిచాయి. క్షణంసేపు అతని కళ్ళలోకి చూసుండిపోయిన సుజాత మెల్లిగా అతని గుండెల్లో తలదాచుకుంది. రాజాచేతులు చాలా సేపటివరకూ సుజాత వాడిపోయిన మొహాన్నీ, చెదిరిపోయిన జుట్టునీ నిమురుతూ వుండిపోయినాయి.